




# విజయభాను




విశాఖపట్నం, శనివారం 31-10-2020 VIJAYABHANU DAILY ⁎ VISAKHAPATNAM సంపుటి : 44 సంచిక : 45 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## ఆరోగ్య వనంలో ప్రధాని మోదీ

### కొవిడ్ తర్వాత తొలిసారిగా గుజరాత్‌కు





కేవడియా: ప్రధానమంత్రి నరేంద్రమోదీ గుజరాత్‌లో పర్యటిస్తున్నారు. కొవిడ్ విజృంభణ తర్వాత తొలిసారిగా సొంత రాష్ట్రానికి వెళ్లిన మోదీ అక్కడ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఐక్యతా విగ్రహానికి సమీపంలోని ఆరోగ్య వనం, చిల్డ్రన్ న్యూట్రిషన్ పార్క్, ఏక్తా మాల్‌ను ప్రారంభించారు.

ం అహ్మదాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న మోదీకి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ రూపానీ, గవర్నర్ ఆచార్య దేవ్రత్ సాదర స్వాగతం పలికారు. అక్కడి నుంచి గాంధీనగర్ వెళ్లిన ప్రధాని.. దివంగత గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి కేశుభాయ్ పటేల్ కుటుంబాన్ని పరామర్శించారు. అక్కడి నుంచి నర్మదా జిల్లా కేవడియా గ్రామానికి చేరుకున్నారు. ఐక్యత విగ్రహం సమీపంలో 17 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఆరోగ్య వనాన్ని మోదీ ప్రారంభించారు. గోల్ఫ్ కార్ట్‌లో ప్రయాణించి ఆరోగ్య వనం అందాలను వీక్షించారు.

ఆ తర్వాత చిల్డ్రన్ న్యూట్రిషన్ పార్క్‌ను ప్రారంభించి అక్కడి న్యూట్రీ రైలులో కాసేపు సరదాగా ప్రయాణించారు. భారత సంస్కృతి సంప్రదాయాలు, చేనేత కళలకు అద్దం పట్టే ఏక్తా మాల్‌ను ప్రారంభించి అక్కడి కళాకృతులను వీక్షించారు.

పర్యటనలో భాగంగా కేవడియా-అహ్మదాబాద్ మధ్య సీప్లెయిన్ సేవలను మోదీ ప్రారంభించనున్నారు.

## ఎమ్మెల్యే ధర్మశ్రీ కుమార్తె వివాహానికి సీఎం జగన్ హాజరు

### నూతన వధూవరులకు సీఎం జగన్ ఆశీర్వాదం



విశాఖపట్నం : చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కుమార్తె వివాహానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. నగరంలోని ది పార్క్ హోటల్‌లో జరిగిన ఈ వేడుకలో నూతన వధూవరులు సుమ-చిన్నం నాయుడును సీఎం జగన్ ఆశీర్వదించారు. ఈ వివాహానికి ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సీఎంలు పుష్పశ్రీ వాణి, ధర్మాన కృష్ణదాస్, ఎంపీలు విజయసాయిరెడ్డి, మాధవి, బెల్లన చంద్రశేఖర్, బాలశౌరి, ఎంవీవీ సత్యనారాయణ, మంత్రులు బొత్స సత్యనారాయణ, కన్నబాబు, అవంతి శ్రీనివాసరావు, చెల్లుబోయిన వేణుగోపాల్, ఏపీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, ప్రభుత్వ విప్ బూడి ముత్యాల నాయుడు, ఎమ్మెల్యేలు గుడివాడ అమర్నాథ్, వాసుపల్లి గణేష్ కుమార్, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, అదీప్ రాజ్, ఉమాశంకర్ గణేష్,గొల్ల బాబూరావు, సంబంగి చిన్న అప్పల నాయుడు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు హాజరయ్యారు. అనంతరం ముఖ్యమంత్రి గన్నవరం తిరుగు ప్రయాణం అయ్యారు.

**ముఖ్యమంత్రికి స్వాగతం వీడ్కోలు**

విశాఖపట్నం అక్టోబర్ 30 శుక్రవారం విశాఖపట్నం వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కి విశాఖపట్నం విమానా శ్రయంలో మంత్రులు అధికారులు స్వాగతం పలికారు. ప్రత్యేక విమానంలో సాయంత్రం చోడవరం శాసనసభ్యుడు కరణం ధర్మశ్రీ కుమార్తె వివాహానికి ఆయన విచ్చేశారు. వివాహానికి హాజరై సాయంత్రం గం.6 45 ని. నాకు తిరిగి అదే విమానంలో విజయవాడ బయలుదేరి వెళ్లారు.

విశాఖపట్నంలో ఆయనకు మంత్రులు ధర్మాన కృష్ణదాస్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధికార భాష అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ విశాఖపట్నం ఎంపీ ఎం వి వి సత్యనారాయణ, ఎమ్మెల్సీ మాధవన్, ఎమ్మెల్యే అదీప్ రాజు, జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్, పోలీస్ కమిషనర్ ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా దళితులందరూ ఆర్థికంగా ఎదగాలి

### రాష్ట్ర హోం మంత్రి మేకతోటి సుచరిత



విశాఖపట్నం : ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా దళితులందరూ ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి మేకతోటి సుచరిత పేర్కొన్నారు. శుక్రవారం విశాఖపట్నం వెలంపేటలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర హోంశాఖ మంత్రి మేకతోటి సుచరిత, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావులు ఆవిష్కరించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం అల్ ఇండియా ఎస్సి, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోం శాఖ మంత్రి మేకతోటి సుచరిత మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వారసులమని గర్వముగా చెప్పుకుంటామని తెలిపారు. ఈ రోజు దళితులు ఉద్యోగ, రాజకీయ రంగాలలో రానిస్తున్నారంటే అది ఆయన కృషి ఫలితమేనన్నారు. భారత దేశంలో దళితులు ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ఉన్నారంటే అది ఆయన పెట్టిన భిక్ష మాత్రమేనన్నారు. ఆ మహానుభావుడి ఆలోచన స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 60 శాతం రిజర్వేషన్లను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కల్పించినట్లు పేర్కొన్నారు. ఎక్కడా లేని విధంగా ఒక దళిత మహిళకు హోంమంత్రి, గిరిజన మహిళకు ఉప ముఖ్యమంత్రి పదవిని ఇచ్చి ముఖ్యమంత్రి గౌరవించినట్లు చెప్పారు. రాష్ట్రంలో దళితులందరూ ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నో కార్యక్రమాలను చేపట్టినట్లు వెల్లడించారు. నామినేటెడ్ పోస్ట్ లలో ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీ 50 శాతం కల్పించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా దాదాపు 65 వేల కోట్ల రూపాయలను నేరుగా మహిళ ఖాతాల్లో వేయడం జరిగిందని, దళితులు పారిశ్రామికంగా ఎదగాలని నూతన పాలసీని కూడా తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చడమే మనం

తరువాయి 2లో..

## ఇస్రోకు 102 కోట్ల డాలర్ల జరిమానా విధించిన అమెరికా కోర్టు

న్యూఢిల్లీ : భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)కు చెందిన వాణిజ్య శాఖ యాంత్రిక్స్ కార్పొరేషన్‌కు అమెరికా కోర్టు భారీ జరిమానా విధించింది. బెంగుళూరుకు చెందిన స్టార్టప్ దేవాస్ మల్టీమీడియాకు 102 కోట్ల డాలర్లు చెల్లించాలంటే యాంత్రిక్స్‌ను ఆదేశించింది. రెండు శాటిలైట్లు అభివృద్ధి చేసి, ఎస్-బ్యాండ్ స్పెక్ట్రమ్‌లో సిగ్నల్ అందించే విధంగా దేవాస్‌తో 2005లో యాంత్రిక్స్ ఒప్పందం కుదుర్చుకున్నది. కానీ ఆ ఒప్పందాన్ని 2011లో యాంత్రిక్స్ రద్దు చేసింది. దీని పట్ల దేవాస్ మల్లీమీడియా కోర్టులను ఆశ్రయించింది. ఈ కేసులో భారత సుప్రీంను ఆశ్రయించిన దేవాస్‌కు ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అయితే తాజాగా సియాటిల్‌లోని వాషింగ్టన్ జిల్లా కోర్టు జడ్జి థామస్ జెల్లీ ఈ కేసులో అక్టోబర్ 27వ తేదీన తీర్పు వెలువరించారు. దేవాస్‌కు 56.2 కోట్ల డాలర్ల జరిమానా చెల్లించాలని, వడ్డీతో కలిపి మొత్తం నష్టపరిహారం 102 కోట్ల డాలర్లు చెల్లించాలంటూ సియాటిల్ కోర్టు తన తీర్పులో యాంత్రిక్స్‌ను ఆదేశించింది. అయితే కోర్టు పరిధి అంశంలో దేవాస్, యాంత్రిక్స్ మధ్య విభేదాలు ఉన్నా.. అమెరికాలోనూ కోర్టు కేసును వాదించే హక్కు ఉన్నట్లు గతంలో దేవాస్ పేర్కొన్నది. యాంత్రిక్స్ కార్పొరేషన్‌కు సియాటిల్‌లో ప్రధాన కార్యాలయం ఉన్నది.






## పెళ్లివ్యాను బోల్తా

### 8మంది మృతి



దేవీపట్నం : తూర్పు గోదావరి జిల్లాలో ఈ తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. పెళ్లి వేడుకకు హాజరై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా...వ్యాను అదుపుతప్పి బోల్తాపడటంతో ఎనిమిదిమంది దుర్మరణం చెందారు. ఈ విషాదఘటన జిల్లాలోని గోకవరంలో చోటు చేసుకుంది. గోకవరం మండలం ఠాకూర్ పాలెంనకు చెందిన యువకుడు, రాజానగరం మండలం వెలుగుబందాకు చెందిన యువతికి గురువారం రాత్రి తంటికొండ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వివాహం జరిగింది.


వివాహ వేడుక పూర్తయిన తర్వాత వధూ వరుల కుటుంబసభ్యులు, బంధువులు దాదాపు 22 మంది వ్యానులో కొండపై నుంచి తిరుగు ప్రయాణమయ్యారు.

ఈ క్రమంలో వ్యాను బ్రేకులు ఫెయిల్‌అవడంతో అదుపుతప్పి మెట్ల మార్గం ద్వారా కొండ కిందకు బోల్తా పడింది. వాహనంలో ప్రయాణిస్తున్న వారిలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా, ఆస్పత్రికి తరలిస్తుండగా ఇద్దరు, చికిత్స పొందుతూ ఒకరు కన్నుమూశారు. తీవ్రగాయాలైన వారిని రాజమండ్రిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులు.. కంబాల భాను(గోకవరం), సింహాద్రి ప్రసాద్ (ఠాకూర్‌పాలెం), ఎల్లా లక్ష్మి, ఎల్లా దివ్యశ్రీలక్ష్మి (దివాన్ చెరువు), చాగంటి మోహిని(గాదారాడ), పచ్చకూరి నరసింహ(గంగంపాలెం), మరొకరు పశ్చిమగోదావరి జిల్లాకు

తరువాయి 2లో..

## బ్యాంకులకు కొవిడ్ గండం..!

### రూ.లక్ష కోట్ల క్రెడిట్‌కార్డు రుణాలపై నీలినీడలు



న్యూఢిల్లీ : అసలే మొండి బకాయిలతో కునారిల్లుతున్న బ్యాంకులపై ఇప్పుడు క్రెడిట్ కార్డు రుణాల భారం కూడా పడనుంది. కొవిడ్-19 కారణంగా తలెత్తిన పరిస్థితులతో భారీ ఎత్తున క్రెడిట్ కార్డు రుణాలు ముప్పులో పడ్డాయని ఆర్‌బీఐ ఇచ్చిన ఓ నివేదికలో పేర్కొంది. ఈ మొత్తం దాదాపు రూ.లక్ష కోట్ల వరకు ఉండొచ్చని తెలిపింది.

ఇటీవల కాలంలో క్రెడిట్ కార్డులు జారీ చేసే సంస్థలు ఒక్కసారిగా అప్రమత్తమయ్యాయి. ఆయా సంస్థలు అందించే సొమ్ము నాసిరకమైన కష్టమర్లకు వెళుతున్నట్లు గుర్తించాయి. అంటే గతంలో సొమ్ములు ఎగ్గొట్టినవాళ్లు, బకాయిలు ఆలస్యంగా చెల్లించే వారు, రిస్క్‌జోన్‌లో ఉండే వాణిజ్య, కార్పొరేట్ కార్డులన్నమాట. వీటి నుంచి రావాల్సిన సొమ్ములు

తరువాయి 2లో..

# ఫార్మా కంపెనీల నిర్వాకం పై యువ నేత బండారు ఆగ్రహం

## - పెద్ద చెరువులోని చేపలు మృతి చెందడంపై ఆందోళన. - బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్




లంకెలపాలెం : యువనేత, పెందుర్తి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ బండారు అప్పలనాయుడు పరవాడ గ్రామం లోని పెద్దచెరువు లోని చేపలు మృతి చెందడంపై ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం ఆయన పెద్దచెరువుని పరిశీలించారు. అధిక సంఖ్యలో చేపలు మృతి చెందడం పట్ల స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల నిర్లక్ష్య వైఖరి కారణంగా వివిధ చెరువులు కాలుష్యంతో నిండిపోయాయన్నారు. ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలకు కాలుష్య నియంత్రణ అధికారులు అన్నా, పరిశ్రమల శాఖ అధికారులు అన్న, ప్రభుత్వం అన్న భయం లేదన్నారు. ఈ ప్రభుత్వం నాదే అన్న ధీమాలో ఉన్నారన్నారు. ఏం చేసినా మా ఇష్టమే అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కారణంగానే తరచూ వర్షాల సమయాల్లో వ్యర్థ జలాలను కాలువల్లోకి వదిలి పెడుతుండడంతో అవి చెరువు ల్లోకి ప్రవేశించి చేపల మృతికి కారణం అవుతున్నాయన్నారు. ఫార్మా పరిశ్రమల పుణ్యమా అంటూ ఇప్పటికే తాగే నీరు కాలుష్యం, పీల్చే గాలి కాలుష్యం, కనీసం చెరువులను కూడా కాపాడుకోకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. వాస్తవానికి ఫార్మా పరిశ్రమల్లో విడుదలైన వ్యర్థ జలాలను శుద్ధి చేసి వాటిని పైప్లైన్ ద్వారా సముద్రంలోకి వదిలిపెట్టాలని అలా కాకుండా కొన్ని ఫార్మా పరిశ్రమలు లాభాపేక్షతో వ్యర్థ జలాలను బయటికి వదిలి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్న పెందుర్తి ఎమ్మెల్యే కి ఇవేమీ పట్టవన్నారు. కంచే చేను మేస్తే అన్న చందనం గా ఉందని, ఎమ్మెల్యే చెరువులు ఆక్రమిస్తే మేము మాత్రం తక్కువా అన్నట్టు స్థానిక వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సాగునీటి చెరువులోని నీటి నమూనాలను సేకరించి ఏ ఫార్మా కంపెనీ రసాయనాలు చెరువుల్లో కలిసాయో బహిర్గతం చేసి సంబంధిత యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు పైలా రామచంద్రరావు,రెడ్డి శ్రీనివాసరావు, పైలా చిన్న అక్క నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశిక్షణ తరగతులకు ఏర్పాట్లు




గాజువాక : నవంబర్ నెల 2,3వ తేదీ లలో గాజువాకలో. నిర్వహించబోయే ప్రశిక్షణ తరగతుల కోసం జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి ఏమ్మెల్సీ పి వి ఎన్ మధవ్, జిల్లా బీజేపి అధ్యక్షుడు మేడపాటి రవీంద్రలు శుక్రవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా...మాధవ్ మాట్లాడుతూ నవంబర్ 2,3 వ తేదీ లలో నిర్వహించే ప్రశిక్షణ తరగతులను గాజువాక చినగంట్యాడ లోని ఒక ఫంక్షన్ హల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కేంద్ర మాజీ మంత్రి దగ్గుపాటి పురంధేశ్వరి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు, జాతీయ బీజేపి ప్రధాన కార్యదర్శి సతీష్,ఏ పి రాష్ట్ర బీజేపీ కోఆర్డినేటర్ సునీల్ దేవదర్, రాష్ట్ర బీజేపి ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు,జిల్లా ముఖ్య నాయకులు, కార్పొరేటర్ అభ్యర్థులు, వార్డ్ అధ్యక్షులు శక్తి కేంద్ర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. జిల్లా అధ్యక్షులు రవీంద్ర మాట్లాడుతూ అత్యంత క్రమశిక్షణ యుతంగా శిక్షణా తరగతులు జరగాలని సూచించారు. ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ గాజువాక నాయకులందరం కలసి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. గాజువాక కన్వీనర్ డా.కే.ఎన్.ఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటి ప్రశిక్షణ తరగతులు గాజువాక నియోజకవర్గంలో జరుగుతున్నాయని, ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు మరియు జాతీయ స్థాయి నాయకులు పాల్గొంటారని. ఈ కార్యక్రమాన్ని విజయ వంతంచేయాలని గాజువాక నియోజకవర్గ నాయకులకు పిలిపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఇంద్రసేనా రెడ్డి,88వ వార్డు కార్పొరేటర్ అభ్యర్ది దా డి . న ా క ా జు , ే క - క న్వీ న ర్ గూటూరు.శంకరరావు,జిల్లా ఉపాధ్యక్షులు దీనంకొండ.కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



విశాఖపట్నం : జీవీఎంసీ 53 వ వార్డు పరిది డాక్టర్ జాకీర్ హుస్సేన్ నగర్ మస్జీద్ - ఈ - అల్ ఖాదిర్ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు మస్జీద్ ప్రాంగణంలో ముస్లిం సోదరులు ఖురాన్ పఠించారు. కార్యక్రమంలో బాగంగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ చిన్నారులు నాతే కాలములు ఆలపిస్తూ చందన యాత్ర నిర్వహించారు . ఇస్లాం మతానికి చెందిన ఆరాధ్య గురువు అయిన మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఈ వేడుకలను నిర్వహిస్తామని ఇస్లామిక్ క్యాలెండర్ లో మూడవ నెలలో ఈ పర్వదినాన్ని చేసుకుంటామని మస్జీద్ కమిటీ సభ్యులు తెలిపారు.

కార్యక్రమంలో అద్యక్షులు మున్నా , కార్యదర్శి అన్సర్ వలి , నూరి తదితరులు పాల్గున్నారు.



# వైయస్సార్ టీఎఫ్ అధ్యక్షులుగా ఆనందరావు



అరకులోయ : అరకులోయ మండల కేంద్రంలో వైయస్సార్ టీఎఫ్ సమావేశం నిర్వహణ భాగంగా జిల్లా అధ్యక్షులు చొక్కాకుల. సూర్యనారాయణ,మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి బాదిరెడ్డి గంగాధర్ రావుల అధ్యక్షతన,అరకులోయ నియోజకవర్గ వైయస్సార్ టీచర్ ఫెడరేషన్ కన్వీనర్ గా జలియా.ఆనందరావు ఎన్నుకో బడ్డారు.ఈ సందర్భంగా ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# కరోనా పై అవగాహన ర్యాలీ




గాజువాక: జీవీఎంసీ70 వ వార్డు శ్రామిక నగర్ లో కరోనాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ ని నిర్వహించారు. వార్డు వైసిపి కార్పొరేటర్ అభ్యర్థి చందు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉరుకూటి చందు మాట్లాడుతూ కారోన తగ్గుముఖం పడుతున్న వేళ ప్రజలందరూ ప్రభుత్వ నిబంధనలను పాటించి, కారోన పట్ల అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు కొణతాల రాము ,రోజారాణి, నాగేశ్వరరావు సచివాలయ సిబ్బంది ప్రసన్న,పవన్ కుమార్, మానస,శ్రావణ్,వంశీ మరియు డ్వాక్రా మహిళలు వాళ్ళు వాలంటీర్లు పాల్గొన్నారు.

# స్వచ్ఛ్ సర్వేక్షన్- 2021 అవగాహనా కార్యక్రమం



భీమునిపట్నం : జీవిఎంసి భీమిలి జోనల్ కమీషనర్ సి.హెచ్ గోవిందరావు ఆదేశాల మేరకు స్థానిక. అప్పికొండ వీధిలో శానిటరీ ఇన్స్పెక్టర్ బి.మహాలక్ష్మీ నాయుడు ఆధ్వర్యంలో స్వచ్ఛ్ సర్వేక్షన్ - 2021 అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తమ ఇంట్లో చెత్తను తడి,పొడి చెత్తను విడదీసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలనీ తెలిపారు.

అదేవిధంగా ఇంటి వద్ద నే సేంద్రీయ ఎరువును తయారు చేసే విధానాన్ని వారికి తెలియపరిచారు. స్వచ్ఛ్ సర్వేక్షన్-2021లో విశాఖ ను ప్రధమ స్థానంలో నిలుపుటకు ప్రజలందరూ సహకరించాలనీ కోరారు.అంతేకాకుండా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ కార్యదర్శి, రవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా దళితులందరూ ఆర్థికంగా ఎదగాలి




ఆయనకు ఇచ్చే నిజమైన నివాళిఅని చెప్పారు.

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేత్కర్ ఆశయాలను అందరం తప్పక పాటించాలన్నారు. అంబేత్కర్ ఒక్క దళితులకే కాదు యావత్ దేశ ప్రజలకు పూజనీయులని పేర్కొన్నారు. భారత దేశమే కాదు, ప్రపంచం మొత్తం గర్వించదగ్గల వ్యక్తి డాక్టర్ బి.ఆర్. అంబేత్కర్ అని కొనియాడారు. భారతదేశంలోని అందరు నాయకుల్లో బిఆర్ అంబేత్కర్ అత్యుత్తమ మేధావని ఎప్పుడో గుర్తించినట్లు స్పష్టం చేశారు. భారత ప్రజలు ఇప్పుడు స్వేచ్ఛ, హక్కులును పొందుతున్నామని అది ఆయన కృషి ఫలితమేనన్నారు. అలాంటి మహనీయుని విగ్రహాలు ఊరి బయటకాదు, ఊరి నడిబొడ్డున ఉంచాలని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి దళితుల పక్షపాతి అని ఖచ్చితంగా చెప్పాలన్నారు.

అంబేత్కర్ ఆశయాలను అమలుపరుస్తూ దళితుల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో దళితులు ఆర్థికంగా, రాజకీయంగా బలపడాలని ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు ఎంవివి సత్యనారాయణ, శాసన మండలి సభ్యులు రవీంద్రబాబు, ఇన్కమ్ టాక్స్ కమిషనర్ మేకతోటి దయాసాగర్, శాసన సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, గొల్ల బాబురావు, ఎస్.సి., ఎస్.టి. పోస్టల్ ఎంప్లాయిస్ అసోషియేషన్ సభ్యులు బి. యేసు, బి. వర్రపసాద రావు, తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకులకు కొవిడ్ గండం..!

పేరుకుపోయాయి. జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఎస్బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్స్ సంస్థ జారీ చేసిన కార్డులకు సంబంధించిన సొమ్ములో ఎన్పీఏలు 4.29శాతానికి చేరాయి. ముఖ్యంగా కొవిడ్ కారణంగా ప్రభుత్వం విధించిన ఆరునెలల మారటోరియం ఆగస్టులో ముగియటం కూడా దీనికి కారణమైంది.

ఆర్బీఐ ఇటీవల విడుదల చేసిన డేటా ప్రకారం బ్యాంకులు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. 2020-21 ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల్లో ఈ వ్యాపార వృద్ధిరేటు -3శాతం ఉంది. అదే సమయంలో రావాల్సిన బకాయిలు రూ.1.04లక్షల కోట్లు ఉన్నాయి. గతేడాది ఇదే సమయంలో వృద్ధిరేటు 10శాతంగా ఉంది. వాస్తవానికి అన్సెక్యూర్డ్ కేటగిరిలో ఉండే క్రెడిట్ కార్డ్, వ్యక్తిగత రుణాల్లో గత నాలుగైదేళ్లలో భారీగా వృద్ధిరేటు నమోదైంది. కొన్ని బ్యాంకుల్లో ఈ వృద్ధి 25-30శాతం మధ్యలో ఉందంటే అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు ఈ రుణాల్లో ఎగవేతలు ఎక్కువగా ఉండటంతో వృద్ధిరేటు తగ్గిపోయింది. ప్రపంచ వ్యాప్తంగా కొవిడ్ కారణంగా ఉద్యోగాలు పోవడం, జీతాల్లో కోత వంటి కారణాలతో రుణ ఎగవేతలు పెరిగాయి. చాలా మంది గృహ, వాహన రుణాల కంటే ముందు క్రెడిట్ కార్డుల చెల్లింపులను ఆపివేస్తున్నారు.

యాక్సెస్ బ్యాంక్ 2019-20 ద్వితీయార్థం నుంచే మొండి బకాయిల ముప్పు ఉన్న వాటిని జాగ్రత్తగా వర్గీకరిస్తూ వస్తోంది. ఇక ఆర్బీఎల్ బ్యాంక్ నుంచి లబ్ధిపొంది.. ఇటీవల ప్రభుత్వ మారటోరియం ఉపయోగించుకొన్న వాటిల్లో 5శాతం వరకు రుణాలు తిరిగి రాకపోవచ్చని ఆ సంస్థ అంచనావేస్తోంది. ప్రభుత్వం కనుక ఈ రుణాలను రెండేళ్లపాటు పునర్వ్యవస్థీకరిస్తే.. వెంటనే మొండి బకాయిలు బయటకు రావని నిపుణులు చెబుతున్నారు. ఈ గడువు పూర్తయ్యాక బ్యాంకులు లాభాల నుంచి భారీ ఎత్తున ప్రొవిజన్లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. ఇప్పటికే 10 శాతం ప్రొవిజన్లు ఏర్పాటు చేసుకోవాలని ఆర్బీఐ సూచించింది. ఎన్పీఏలు భారీగా ఉంటే ఇది ఏమాత్రం చాలదు.

2008 ఆర్థిక సంక్షోభం తర్వాత అన్సెక్యూర్డ్ రుణాల విభాగానికి ఎదురైన అతిపెద్ద ముప్పు ఇదే. చిన్న రుణాలు ఇచ్చే ఎన్బీఎఫ్సీలు అయితే మూతపడే ముప్పు కూడా ఉంది.

# పెళ్లివ్యాను బోల్తా

చెందిన వ్యక్తిగా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. మృతులు అందరూ సమీప బంధువులే. ఈ ప్రమాదం నుంచి పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తె క్షేమంగా బయటపడ్డారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి: చంద్రబాబు

తూర్పుగోదావరి జిల్లాలో పెళ్లి వ్యాన్ బోల్తాపడిన ఘటనపై తెలుగుదేశం అధినేత చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న చంద్రబాబు ఘటనపై ట్విటర్ వేదికగా స్పందించారు. ప్రమాదంలో పలువురు మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి, మృతుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బాధితులకు ప్రభుత్వం అండగా నిలవాలి: అచ్చెన్న

తంటికొండ రోడ్డు ప్రమాదం దురదృష్టకరమని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఆయన డిమాండ్ చేశారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ తరపున ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న విష్ణు, మంచు లక్ష్మి



చిత్తూరు : ప్రముఖ సినీ నటుడు మంచు విష్ణు, మంచు లక్ష్మి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో శ్రీ వేంకటేశ్వరుని సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.

ఆలయం వెలుపల మంచు విష్ణు మీడియాతో మాట్లాడుతూ... తిరుపతిలో మోహన్ బాబు సన్ ఆఫ్ ఇండియా సినిమా షూటింగ్ ప్రారంభం అయిందని, మోసగాళ్ళు సినిమా త్వరలోనే విడుదల కానుందని అన్నారు. మోసగాళ్ళు సినిమా విడుదల సందర్భంగా స్వామి వారి ఆశీస్సులు పొందమని చెప్పారు. త్వరలోనే శ్రీను వైట్ల దర్శకత్వంలో మరో సినిమా ప్రారంభం చేయనున్నట్లు మంచు విష్ణు తెలిపారు.

### పెదనాయుడుపాలెం లో
# సామూహిక కుంకుమ పూజలు



సబ్బవరం : మండలంలోని మేజర్ పంచాయతీ లో భాగమైన పెదనాయుడు పాలెం గ్రామంలో మహిళలతో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి .విజయదశమి రోజున దుర్గాదేవి అమ్మవారిని గ్రామంలో నెలకొల్పారు. అప్పటినుండి ఇప్పటివరకు దుర్గాదేవి అమ్మవారికి దీప దూపములతో ప్రత్యేక పూజలు జరిగాయి. శుక్రవారం ఉదయం అత్యధికంగా మహిళలచే గ్రామ పురోహితులు శ్రీనివాస్ పంతులు, ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు జరగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేస్తే అమ్మవారి కృపా, కరుణ కలుగుతుందని, కోరిన కోరికలు కూడా అమ్మవారు నెరవేరుస్తారని అన్నారు. సకాలంలో వర్షాలు పడి బాగా పండుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలోమేజర్ పంచాయతీ వార్డు మెంబరు సబ్బవరం సత్యనారాయణ (బుజ్జి), వైసిపి ఎంపీటీసీ అభ్యర్థి సబ్బవరపు శ్రీనివాస రావు, సబ్బవరపు నాగభూషణం, సబ్బవరపు సత్యనారాయణ లాయర్, గొర్లి శీను, గ్రామ పెద్దలు అత్యధికంగా మహిళలు పాల్గొన్నారు

# సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వినతి పత్రం




భీమునిపట్నం : జీవిఎంసి భీమిలి జోన్ 2వ వార్డ్ బీజేపీ అభ్యర్థి గనివాడ పార్వతి ఆధ్వర్యంలో తగరపువలస నుంచి భీమిలి మధ్యన ఉన్న రహదారిలో మహిళలు వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారనీ అదేవిధంగా, ఆడ పిల్లలు రహదారుల్లో నడవాలంటే ఇబ్బందులు, పడుతున్నారనీ అన్నారు.

ఆ ప్రాంతాల్లో సి సి కెమెరాలు అమలు పరచాలని, పోలీస్ పెట్రోలింగ్ తప్పనిసరిగా ఉండాలి అని జిల్లాల్లో మహిళలకు రక్షణ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు. మీద శుక్రవారం దిశా మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ రూపవతి ని కలిసి సమ స్యలు వివరించి వినతి పత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు మాధవి లత, కోడూరు సంజీవ్ రావు, లయన్.డాక్టర్ సత్తరవు వాయు నందన రావు భారతీయ జనతా పార్టీ యువ మోర్చా నాయకులు ఫణీంద్ర, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అవంతి విద్యార్థులు హెబల్ బెలోస్ కంపెనీ కి ఎంపిక కావడంపై హర్షం



భీమునిపట్నం : తగరపువలస లో ఉన్న అవంతి ఇన్సిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాల లో మెకానికల్ విభాగానికి చెందిన 22మంది విద్యార్థులు హెబల్ బెలోస్ కంపెనీ కి ఎంపిక కావడం పై కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్. ఎన్. వి గణేష్, డైరెక్టర్ హెచ్. ఆర్ డా. ఆకుల చంద్ర శేఖర్,ఇంజనీరింగ్ మెకానికల్ విభాగాధిపతి లక్ష్మీ శ్రామిక లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి విద్యను అభ్యసిస్తూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. అంతేకాకుండా ప్రతీ విద్యార్థి ఆంగ్ల భాష పై పట్టు సాధించి అభివృద్ధి చెంది ఉన్నత శిఖరాలను చేరుకోవాలనీ అన్నారు. ఇప్పుడు కరోనా కారణంగా నిబంధనలు పాటించాలని కోరారు.

ఈ 22మంది విద్యార్థులకు అవంతి విద్యాసంస్థల చైర్మన్, రాష్ట్ర మంత్రి అవంతి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ డా.లక్ష్మీ ప్రియాంక, మేనేజింగ్ డైరెక్టర్ వై. శ్రవణ్ కుమార్, కళాశాల ప్రెసిడెంట్ ముత్తెంశెట్టి నందీష్ లు అభినందనలు తెలియజేశారు.

### గిరి యువతకు వెలుగునిచ్చిన
# జగగన్న చిత్రపటానికి పాలాభిషేకం



అరకులోయ : అరకు నియోజకవర్గం హుకుంపేట మండల కేంద్రంలో పర్యటన భాగంగా వైయస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి నియోజకవర్గ పరిధిలోని వివిధ మండల నాయకులతో పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,బడుగు బలహీనవర్గాలు శ్రామికులుగానే మిగిలి పోకూడదని,పెద్ద పెద్ద శ్రామిక వేత్తలుగా మారాలనేదే జగగన్న పెద్ద ఆశయం.గిరిజన యువతల ఫ్యూచర్,మార్చేందుకు జగనన్న పెద్ద పీట వేశారని, యువతి,యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద బయలు మండల మాజీ జడ్పీటీసీ సూర్య నారాయణ, మాజీ ఎంపీపీ ఉమామహేశ్వరరావు, యువజన విభాగం నాయకులు కతారి సురేష్ కుమార్, నైని.సత్తిబాబు, కోటిబాబు, సాంబ, సూరిబాబు, నర్సింగరావు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

### పొదుపు సంఘాల మహిళలకు
# కోవిడ్ నియంత్రణ పై అవగాహన కార్యక్రమం




విశాఖపట్నం : కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం 38 వార్డు లో జోన్-3, సీడీవో రాము, జోన్. 3, టిఎల్ఎఫ్ ప్రెసిడెంట్ బెహరా వెంకటరత్నం ఆధ్వర్యంలో

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కోవిడ్-19 అవగాహన కార్యక్రమములో భాగంగా పొదుపు సంఘాల మహిళలకు కోవిడ్ నియంత్రణ పై అవగాహన మరియు సచివాలయల వారీగా ర్యాలీలు నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు సన్యాసిరావు సచివాలయం సెక్రటరీ లు ప్రసాద్, రాజు, నాగేశ్వరావు, రామకృష్ణ, టిఎల్ఎఫ్ ఆర్పి నూరి, సాయి ఆర్పిలు మంగ, శ్రీదేవి, కనకమహాలక్ష్మి, అరుణ, మున్ని, వైస్సార్సీపీ నాయకులు అదిల్, వాసుపల్లి రాజు, సురేష్, కడియం ప్రసాద్, కిషోర్, సత్యానందం పొదుపు సంఘ మహి ళలు, అందరూ పాల్గోవడం జరిగింది.

### కరోనాపై అవగాహన




నాతవరం : మిమ్మల్ని మీరు రక్షించుకోండి. ఇతరులను రక్షించండి అనే నినాదంతో కరోనా పై నాతవరంలో శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి సీనియర్ నాయకులు అంకంరెడ్డి జమీలు మాట్లాడుతూ కరోనా పై అందరూ అప్రమత్తంగా ఉండా లన్నారు. బయటకు వచ్చేటప్పుడు ఖచ్చితంగా మాస్కులు ధరించి భౌతిక దూరం పాటించా లన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చిన్నబ్బాయి, వీఆర్వో రమేష్, అంగన్వాడీ టీచర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

### రైతులకు సాంకేతిక సేవలు అందించేందుకు
# కృష్ ఈ కేంద్రాలు కృషి

విశాఖపట్నం : రైతులకు విస్తృతస్థాయిలో సాంకేతికాధారిత సేవలను పంటలు, పంట జీవిత కాలంలో వివిధ దశల కోసం అందించేందుకు గానూ కృష్ ఈ కేంద్రాలను ప్రారంభించినట్టు ఫార్మ్ ఎక్విప్మెంట్ సెక్టార్ (ఎఫ్ ఈఎస్) అధ్యక్షులు తెలిపారు. మహీంద్రా యొక్క నూతన ఫార్మింగ్ యాజ్ ఏ సర్వీస్ (ఫాస్) లో భాగంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో డిజిటల్ యుగాన్ని తీసుకువచ్చేందుకు కృష్ ఉపయోగకరమన్నారు. ఆగ్రోనమీ, యాంత్రీకరణ, డిజిటైజేషన్ పై ఆధార పడటం ద్వారా ఎకరా భూమికి రైతులకు వచ్చే ఆదాయం దీంతో వృద్ధి అవుతుందన్నారు. వీటికి మూడు ఫార్మర్ ఫేసింగ్ యాప్స్ కృష్ఈ, కృష్ఈ రెంటల్, కృష నిదాన్లు మద్దతునందిస్తా యన్నారు. ఇవి ప్రగతిశీలంగా ఉండటంతో పాటుగా అందుబాటు ధరలలో ఉండి రైతులకు అనుకూలంగా ఉంటాయని, మొత్తం పంట కాలంలో డిజిటల్ ఆధారిత సేవలను అందించడం ద్వారా రైతు ఆదాయం వృద్ధి చేయడాన్ని కృష్ ఈ లక్ష్యమన్నారు.

# కల్వర్టును పునర్నిర్మించాలి

**తగరపువలస టిడిపి డివిజన్ అధ్యక్షుడు తమ్మిన సూరిబాబు**

భీమునిపట్నం: తగరపువలస బాలాజీ నగర్, శ్రీ ఎల్లారమ్మ తల్లి ఆలయానికి వెళ్లే మార్గంలో శిథిలావస్థకు చేరుకున్న కల్వర్టును పునర్నిర్మించాలని తగరపువలస టిడిపి డివిజన్ అధ్యక్షు డు తమ్మిన సూరిబాబు , జీవీఎంసీ, భీమిలి జోన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. శిథిలావస్థకు చేరుకున్న కల్వర్టును శుక్రవారం ఆయన పరిశీలించారు. కల్వర్టు మరమ్మతుకు గురవడంతో, ఇటీవల కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంతంలో ఉన్న నీరు ఎటు వెళ్లక, ఉండిపోవడంతో ఎల్లారమ్మ తల్లి ఆలయానికి వెళ్లి, వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నీరు నిల్వ ఉండిపోవడంతో, అటుగా వెళ్లే భక్తులు, స్థానికులు దుర్గంధంతో అవస్థలు పడుతున్నారని వివరించారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి, సమస్య తీవ్రతను, ప్రాధాన్యతను పరిగణ న లోకి తీసుకొని, కల్వర్టును పునర్నిర్మించాలని కోరారు.

# సచివాలయం కేంద్రాన్ని సందర్శించిన జేసీ



కంచరపాలెం : జివియంసి 53 వ వార్డు పరిధి మర్రిపాలెం మహారాణీ వీధి వద్దనున్న సచివాలయం కేంద్రాన్ని జాయింట్ కెలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ మేరకు సచివాలయం కేంద్రంలో రికార్డులు తనిఖీ చేసిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవలే కుల ధ్రువీకరణ, ఆదాయ దృవీకరణ పత్రాలు లబ్దిదారులకు అందజేయ టంలో ఆల స్యం ఎందకవుతుందని సిబ్బం దికి ప్రశ్నించారు. సచివాలయం కేంద్రంలో కుల, ఆదాయ దృవీకరణ పత్రాలను తమ కార్యలయంలో అప్లోడ్ చేసి తహశీల్దార్ కార్యా లయానికి పంపిస్తున్నామని అయితే తహశీల్దార్ కార్యలయం నుండి కొన్ని పత్రాలు తిరస్కరణకు గురవు తున్నాయని తిరిగి తగిన దృవ పత్రా లతో తహశీల్దార్ కార్యాలయానికి పంపిస్తున్నామని ఈక్రమంలో తహశీల్దార్ కార్యలయం నుండి ధ్రువపత్రాలు రావటానికి అలస్యం అవుతుందని వివరించారు. తహశీల్దార్ తో సమీక్షించి సమస్య పరిష్కరిస్తామని జేసీ తెలిపారు.

ఆయన వెంట జీవీ ఎంసీ జోన్ -4 కమిషనర్ పి.సింహా చలం, ఎ.ఎస్ .ఓ మూర్తి తదితరులు వున్నారు.

# ఏయూ భూములను స్టార్టప్ కంపెనీలకు ఇవ్వొద్దు




విశాఖపట్నం : ఎస్.ఎఫ్.ఐ ధర్నా ఆంధ్రాయూనివర్శిటీ భూములను స్టార్టప్ కంపెనీలకు ఇచ్చే ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) గ్రేటర్ విశాఖ నగర డిమాండ్ చేస్తుంది. యూనివర్శిటీ భూములను అంకురాలకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఎయు మేయిన్ గేటు వద్ద ఎస్.ఎఫ్.ఐ ధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో నగర కార్యదర్శి ఎల్.జే నాయుడు పాల్గొని మాట్లాడుతూ స్టార్టప్ కంపెనీలకు గతంలో విఎంఆర్ డి ఏ భూములను ఇవ్వడానికి ఒప్పందం చేసుకొని నేడు విశాఖకు రాజధాని ప్రకటించడంతో రద్దుచేసారన్నారు. ఇప్పుడు యూనివర్శిటీలో ఉన్న భూములను ఇస్తామని రిజిస్ట్రార్, విసిలు ప్రకటించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే యూనివర్శిటీ భూములను ప్రైవేట్ వారికి కట్టబెట్టా రన్నారు. భవిష్యత్ అవసరాలకోసం యూనివర్శిటీ భూములను ఉంచుకోకపోతే విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఆటస్థలాలను సైతం ప్రైవేట్ పరం చేస్తే విద్యార్థులు తీవ్ర నష్టపోతారన్నారు. లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయనే పేరుతో గత ప్రభుత్వాలు వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేట్ కంపెనీలకు ధారధత్తం చేసాయి. కానీ ఉద్యోగాలు కల్పించడంలో నామమాత్రం. కొన్ని ఐటి సంస్థలు పునాదులు కూడా వేయని పరిస్థితి. ఇప్పుడు అంకురాల పేరుతో ఎయు భూములు ఇవ్వడం వలన అందమైన భవనాలు కడతారు తప్ప ఉద్యోగాలు కల్పించబడవు. యూని వర్శిటీ విసి ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని, ఉద్యోగా లొస్తాయని పేర్కొనడం పచ్చి అబద్ధం. ఏ రకంగా ఉపయోగపడతాయో బహి రంగంగా తెలపాలన్నారు. కేవలం భూములను ప్రైవేట్ పరం చేయడమే తప్ప మరొకటి కాదు. తక్షణమే యువతకు ఎటువంటి ప్రయోజనం లేని భవనాల నిర్మాణం చేపట్టడం మరియు భూముల కేటాయింపు విరమించుకోవాలని లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నగర అధ్యక్షులు కె. ప్రభుదాస్, కార్యదర్శివర్గ సభ్యులు బి.కుసుమా, వై. అప్పలరాజు, ఎమ్. రాజ్ శేఖర్, లావణ్య, ఎస్.ఎఫ్.ఐ అధ్యక్ష, కార్యదర్శులు బి. గౌతమ్, ఎల్.చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుకు ఇరువైపులా తుప్పలను తొలగించిన
### కొయ్యూరు పోలీసులు

కొయ్యూరు : కొయ్యూరు మండలం చింతాలమ్మ ఘాట్ రోడ్డు దగ్గర రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను కొయ్యూరు సిఐ వెంకటరమణ, ఎస్సై దాసరి నాగేంద్ర ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి గురువారం తొలగించారు. ఘాట్ రోడ్డులో రహదారికి అడ్డంగా పొదలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయి ప్రమాదకర పరిస్థితుల్లో ఉండడంతో ప్రయాణ ికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు స్పందించిన ఎస్సై సిబ్బందితో కలిసి స్థానిక ప్రజల సహాయంతో జంగల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు.




**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

(1) ప్రకటన నెం. eT-BR-WAT-05-2020, తేదీ. 21.10.2020

**పని పేరు:** అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు/ BR/వాల్తేరు వారి పరిధిలో సీనియర్ సెక్షన్ ఇంజనీరు/BR/ వాల్తేరు సెక్షన్స్ నందు కోరకొండ-విశాఖపట్నం-దువ్వాడ మెయిన్ లైను పైన మరియు WMYD యార్డు లైన్లు పైన 30.09.2021 కాలం ముగిసే వరకు బ్రిడ్జి పనులు నిర్వహణ కొరకు బ్రిడ్జ జోనల్ (స్టీల్ పనులు) కాంట్రాక్టు.

**పని విలువ సుమారు:** ₹ 1,07,47,410.03, బయానా: ₹ 2,03,700/-.

(2) ప్రకటన నెం. eT-BR-WAT-06-2020, తేదీ. 21.10.2020

**పని పేరు:** అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు / BR/వాల్తేరు వారి పరిధిలో సీనియర్ సెక్షన్ ఇంజనీరు/BR/ విజయనగరం సెక్షన్స్ నందు పలాస-విజయనగరం మెయిన్ లైను, లడ్డా-విజయనగరం RV లైను మరియు నౌపడ-గుణుపూర్ NG లైన్లు పైన 30.09.2021 కాలం ముగిసే వరకు బ్రిడ్జి పనులు నిర్వహణ కొరకు బ్రిడ్జ జోనల్ (స్టీల్ పనులు) కాంట్రాక్టు.

**పని విలువ సుమారు:** ₹ 92,00,597.61, బయానా: ₹ 1,84,000/-.

(3) ప్రకటన నెం. eT-BR-WAT-07-2020, తేదీ. 21.10.2020

**పని పేరు:** అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు / BR/వాల్తేరు వారి పరిధిలో సీనియర్ సెక్షన్ ఇంజనీరు/BR/ రాయగడ సెక్షన్స్ నందు దామన్‌జోడి-సింగపురం రోడ్ KR లైను, తెరుబలి-లడ్డా సెక్షన్ RV లైన్లు పైన 30.09.2021 కాలం ముగిసే వరకు బ్రిడ్జి పనులు నిర్వహణ కొరకు బ్రిడ్జ జోనల్ (స్టీల్ పనులు) కాంట్రాక్టు.

**పని విలువ సుమారు:** ₹ 1,15,01,499.84, బయానా: ₹ 2,07,500/-.

(4) ప్రకటన నెం. eT-BR-WAT-08-2020, తేదీ. 21.10.2020

**పని పేరు:** అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు / BR/వాల్తేరు వారి పరిధిలో సీనియర్ సెక్షన్ ఇంజనీరు/BR/ అరకు సెక్షన్స్ నందు కొత్తవలస-మల్లిగురా (KK-I లైను) మరియు కోరాపుట్-డామన్ జోడి (KR లైను) పైన 30.09.2021 కాలం ముగిసే వరకు బ్రిడ్జి పనులు నిర్వహణ కొరకు బ్రిడ్జ జోనల్ (స్టీల్ పనులు) కాంట్రాక్టు.

**పని విలువ సుమారు:** ₹ 29,32,357.07, బయానా: ₹ 58,700/-.

(5) ప్రకటన నెం. eT-BR-WAT-09-2020, తేదీ. 21.10.2020

**పని పేరు:** అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు / BR/వాల్తేరు వారి పరిధిలో సీనియర్ సెక్షన్ ఇంజనీరు/BR/ జగదల్‌పూర్ సెక్షన్స్ నందు KK-II లైను పైన 30.09.2021 కాలం ముగిసే వరకు బ్రిడ్జి పనులు నిర్వహణ కొరకు బ్రిడ్జ జోనల్ (స్టీల్ పనులు) కాంట్రాక్టు.

**పని విలువ సుమారు:** ₹ 62,09,598.01, బయానా: ₹ 1,24,200/-.

టెండరు డాక్యుమెంట్ ఖరీదు: (వ.నెం. 1, 2, 3, & 5 కొరకు) ₹ 5,900/- & (వ.నెం. 4 కొరకు) ₹ 3,540/-. పని పూర్తి చేయు కాలం: (అన్ని టెండర్లు కొరకు) 09 నెలలు.

**టెండరు ముగింపు తేదీ మరియు సమయం:** (అన్ని టెండర్లు కొరకు) 26.11.2020న 1330 గంటలకు

పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా ఇట్టి ఇ-టెండర్లుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు అంగీకరించబడవు.

పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు http://www.ireps.gov.in వెబ్‌సైట్ నందు లభిస్తాయి.

సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి ఏదైన మార్పులు / సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి 10 (పది) రోజులు ముందుగా ఈ టెండరును మరొకసారి చూడవలసినదిగా సలహానీయటమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇంజనీరింగ్), వాల్తేరు

PR-323/L/20-21

# విజయభాను

## సంపాదకీయం

### సమయోచిత వ్యూహకర్త

దక్కన్ పీఠభూమిలోని నడిగడ్డ ప్రాంతం ముద్దుబిడ్డ పాములపర్తి వేంకట నరసింహారావు. వెనుకబడిన ప్రాంతంగా చెప్పుకోబడే తెలంగాణ నుంచి వచ్చిన అనర్ఘరత్నం. ఉత్తరాది వారి ఆధిపత్యంలో కొనసాగుతున్న కేంద్ర రాజకీయాల్లో, జాతీయపార్టీల్లో దక్షిణాది నాయకులు ప్రధానమంత్రి స్థాయికి ఎదగడం అరుదైన విషయం.

ఏడున్నర దశాబ్దాలకు దగ్గరున్న స్వతంత్ర భారత రాజకీయాల్లో దేవెగౌడ కొన్ని నెలల తాత్కాలిక ప్రధానమంత్రిత్వం తప్ప దక్షిణాదికి తగిన ప్రాతినిధ్యం లభించలేదు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో దేశ ప్రధాని పగ్గాలు చేపట్టి ఐదేండ్లు సమర్థ పాలననిచ్చి దక్షిణాది నాయకత్వ పటిమను దేశానికే కాదు ప్రపంచానికే చాటిచెప్పిన చాణక్య రాజనీతిజ్ఞుడు పీవీ నరసింహారావు. ఆ విశిష్ట నేత, ఈ నేల ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు శతజయంతి (2020-21) ఉత్సవాలను ప్రభుత్వం ఏడాది పొడువునా జరుపుతుండటం ఆయనకు ఇస్తున్న సముచిత గౌరవం. పీవీకి భారతరత్న ఇవ్వాలన్న డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్నది. దీనిని సమర్థించే వాళ్లున్నారు. విమర్శిస్తున్న వాళ్లూ ఉన్నారు. ఇది సహజం కూడా.

పీవీ మీదున్న ప్రధాన ఆరోపణల్లో నూతన ఆర్థిక విధానాలకు భారతదేశంలో ద్వారాలు తెరిచాడని. పీవీ ప్రధాని పగ్గాలు చేపట్టే సమయానికి దేశం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నది. బంగారం నిల్వలను కూడా తాకట్టు పెట్టి అప్పులు తీసుకునే దుస్థితిలో ఉంది. మరో దిక్కు రష్యా సోషలిస్టు కల విఫలమై అమెరికా ఆధిపత్య ఏకధ్రువ ప్రపంచం ఏర్పడే దిశలో ప్రపంచం పయనిస్తున్నది. క్యూబా లాంటి ఒకట్రెండు దేశాలు తప్ప ప్రపంచ దేశాలు గ్లోబలీకరణ ప్రభావం నుంచి తప్పించుకోలేని స్థితి. అలాంటి పరిస్థితుల్లో పీవీ రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌గా పనిచేసిన ప్రముఖ ఆర్థిక నిపుణుడు మన్మోహన్‌సింగ్‌ను ఆర్థికమంత్రిని చేశారు. నూతన ఆర్థిక విధానాలకు శ్రీకారం చుట్టారు. ఆ రకంగా గ్లోబలైజేషన్‌ను అంగీకరించినట్టే. అది మంచిదా? చెడ్డదా? అనే చర్చ ప్రపంచమంతటా జరిగింది. చదువుల కోసం పశ్చిమ దేశాలకు వెళ్లేవారి సంఖ్య పెరిగింది. భారతదేశం లాంటి కుల సమాజంలో అట్టడుగు బహుజన కులాల వారు కూడా విదేశీ ఉద్యోగాలు పొందారు. ఇంగ్లీష్ మాధ్యమ చదువుల జోరు పెరిగింది. ఇలా చాలామందికి లాభం జరిగిందనే వాదనొక వైపుంటే వృత్తి పనులు దెబ్బతిని వృత్తి కులాల ఆదాయమార్గాలు దెబ్బతిన్నాయన్న వాదన మరో వైపుంది. ఏదేమైనా మొత్తం ప్రపంచాన్నే గ్లోబలైజేషన్ ప్రభావితం చేసింది. చైనా లాంటి కమ్యూనిస్టు దేశం కూడా కన్స్యూమరిజాన్ని ప్రోత్సహించి వ్యాపార సంస్కృతిని ఆహ్వానించిందంటే దాని ప్రభావమేమిటో అర్థమవుతున్నది కదా?

పీవీని నూతన ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టినవాడిగా మాత్రమే చూడకూడదు. ఆ విధానాలు కావచ్చు, పీవీ, మన్మోహన్‌సింగ్‌ల ఆర్థిక విధానాల ఆలోచనాసరళి కావచ్చు భారతదేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి రక్షించాయి. దేశ మత, ప్రాంతీయత, దేశీ వస్తువుల ఉపయోగం, రామానందతీర్థ శిష్యరికం, ఖద్దరు లాంటి గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించడం జీర్ణించుకున్న పీవీ ప్రపంచీకరణను, నూతన ఆర్థిక విధానాలను బిగియారా కౌగిలించుకునే స్వభావం ఉన్నవాడు కాదు. దేశ ఆర్థిక దుస్థితిని చూసి వాటిని ప్రయోగాత్మకంగా మాత్ర మే ప్రవేశపెట్టానని అనేక సభల్లో చెప్పారు. నష్టాల్లో నడుస్తున్న పరిశ్రమలను సిక్ యూనిట్స్‌గా ప్రకటించాడు తప్ప ఒక్క కర్మాగారాన్నీ మూసివేయలేదు. ప్రైవేటీకరణ చేయలేదు. జీతాలను ఆపలేదు. కానీ ఆ తర్వాత కేంద్రంలో వచ్చిన ప్రభుత్వం అన్ని కర్మాగారాలను మూసివేసి లక్షల మందిని రోడ్డుపై నిలబెట్టింది. ఎవరి బాధ్యత ఎంతున్నా పీవీ ప్రారంభించిన ఆర్థిక విధానాలే ఏ పార్టీ ప్రభుత్వం వచ్చినా గత పాతికేండ్లకు పైగా కొనసాగుతున్నాయన్నది వాస్తవం. అప్పుడున్న దేశ ఆర్థికస్థితిని దృష్టిలో పెట్టుకొని తప్పనిసరై ప్రయోగాత్మకంగా మాత్రమే పీవీ నూతన ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టాడు తప్ప లక్షల మంది ఉద్యోగాలు తీసివేయడానికి కాదు. ఆ పాపం ఆ తర్వాత వచ్చిన ప్రధానమంత్రులదే తప్ప పీవీది కాదు. ఆయనను దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి, గ్లోబల్ మాయ ఆర్థిక విధ్వంసం నుంచి కాపాడినవాడిగా చూడాలే తప్ప గ్లోబలైజేషన్‌ను ఆహ్వానించినవాడుగా కాదు. ఆ సమయంలో పీవీ దేశ ప్రధాని కావడం కాకతాళీయమే. ఆ స్థానంలో ఎవరున్నా గ్లోబలైజేషన్‌పై ప్రతిఘటన ఆ మాత్రంగా కూడా ఉండేది కాదేమో!

పీవీ యాభయ్యేండ్లకు పైగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేశారు. రాష్ట్ర మంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి, ప్రధానమంత్రి స్థాయివరకు ఎదిగారు. నెహ్రూ కుటుంబంలో ఇందిరాగాంధీకి, రాజీవ్‌గాంధీకి అత్యంత సన్నిహితులు. సలహాదారులు కూడా. కష్టకాలంలో కాంగ్రెస్‌ను ఆదుకొని గట్టెక్కించారు.

## ఎమ్మెల్యే ధర్మశ్రీ కుమార్తె వివాహా

### చిత్రమాలిక









## కవి సమయం

### జీవితం – ఒక గమ్యం

జీవితం ఒక గమ్యం రా...
నడచిన కొలచి యెక్కువరా...
పరుగులు దీసే పయనంరా...
వెళ్ళిన కొలది యెంతోరా...

అడవులలో మానవులున్నా...
కొండల్లో నివసిస్తున్నా...
కాలం మానవ జీవనరా...
నడవడి మానవధర్మమురా...

బతికుంటే బలుసాకన్నారు పెద్దలు
అలగనీ...
లక్ష్య సాధన కాదంటామా?
కడలి ప్రయాణం మానేస్తామా?
గాలివోడలు వద్దంటామా?
శత్రువు నెదిరిస్తాము సరిహద్దుల్లో...

మనిషికి నడుపును జ్ఞానం రా...
మానవా.... నీ... మహనియ్యతినీ...
ఆరోగ్యం మనిషికిరా...
ముసలితనం కాదురా...
మహాభాగ్యంగా...
మోయుమురా...

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు

## పంచాంగం


మాసం : నిజ ఆశ్వయుజ ; తిథి : పూర్ణిమ రా.7.02; అశ్విని సా.5.51; ప.వ.1.25ల 3.11; తె.వ.4.29ల

శనివారం 31-10-2020

**మేషం** : సామాజిక కార్య క్రమాల పట్ల ఆసక్తితో వ్యవహరిస్తారు. కళ, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. క్రీడలు, పోటీల్లో రాణిస్తారు. ప్రముఖులతో పరిచ యాలు పెంచుకుంటారు. రాజకీయ వ్యక్తులకు చికాకులు తప్పవు. **వృషభం** : నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. స్పెక్యులేషన్ కలిసివచ్చును. మీ లక్ష్యసాధనకు ప్రముఖులు, ప్రభుత్వ అధికారుల సహకారం అందుతుంది. ఆత్మీయులతో ఉల్లాసంగా గడుపుతారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. అవివా హితులకు అనుకూలం. కొత్త పరిచ యాలు ఏర్పడతాయి. **మిథునం** : ఇతరులపై ఆధార పడక స్వశక్తితోనే మీ పనులు పూర్తి చేసుకోవడం శ్రేయస్కరం. చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యంపై దృష్టి సారిస్తారు. వాహనం నడుపుతున్నపుడు ఏకాగ్రత వహించండి. ఆత్మీయులకు ఒక ముఖ్య సమాచారం అందించడం వల్ల మీ గౌరవ ప్రతిష్టలు ఇనుమడిస్తాయి. **కర్కాటకం** : వైద్య రంగంలో వారికి శ్రేయస్కరం. తలపెట్టిన పనులలో విఘ్నాలు, చీటికి మాటికి అసహనం ఎదుర్కొంటారు. విద్యార్థులలో నూతనోత్సాహం చోటు చేసు కుంటుంది. వాహన యోగం పొందు తారు. **సింహం** : ఖర్చులు అధికంగా ఉంటాయి. వృత్తి, వ్యాపారాలకు సంబం ధించిన ఒక నిర్ణయం తీసుకుంటారు. ఆడిటర్లకు విశ్రాంతి లభించును. రాబడికి మించిన ఖర్చులు పెరగడంతో ఒకింత ఆందోళనకు గురవు తారు. స్త్రీలకు కళాత్మక రంగాల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. వ్యాపారాభివృద్ధికి నూతన ప్రణాళికలు, పథకాలు అమలు చేస్తారు. **కన్య** : కుటుంబీకుస మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. మార్కెటింగ్ రంగాల్లో వారికి అనుకూలత. నిరుద్యోగులతు ఆశాజనకం. దైవ, శుభకార్యాల్లో చురుకుగా వ్యవహ రిస్తారు. స్త్రీలు కళాత్మక రంగాల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. వ్యాపారాభివృద్ధికి నూతన ప్రణాళికలు, పథకాలు అమలు చేస్తారు. **తుల** : ప్రేమికుల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తవచ్చు. వాహన చోదకులు వాహనం నడుపునపుడు మెల కువ వహించండి. ఆత్మీయులతో విందులు, పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. వస్త్ర, బంగాలు, వెండి, లోహ, రత్న వ్యాపారస్తులకు పురోభివృద్ధి. ప్రముఖుల కల యిక ప్రయోజనకరంగా ఉంటుంది. **వృశ్చికం** : స్త్రీలకు అపరిచిత వ్యక్తుల విషయంలో మెలకువ అవసకం. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. భాగ స్వామి ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. వస్త్రాలు, వస్తువులు అమర్చు కుంటారు. **ధనుస్సు** : టెక్నికల్, ఎలక్ట్రానికల్ రంగా లలో బాగా అభివృద్ధి చెందు తారు. ఆత్మీయుల కోసం ధనం విరివిగా వ్యయం చేస్తారు. సన్నిహితుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. స్త్రీలకు విలువైన వస్తువులు, ఆభరణాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. నిర్మాణ పనులలో కాంట్రాక్టర్లు సంతృప్తి, పురోభివృద్ధి. **మకరం** : మీ ముఖ్యుల కోసం ధనం బాగా వెచ్చించవలసి వస్తుంది. నూతన దంపతులకు ఎడబాటు తప్పదు. ఉద్యోగస్తులు శ్రమకు తగిన ఫలితం పొందుతారు. మీ సంతానం మొండి వైఖరి మిమ్ములను చికాకు పరు స్తుంది. దూరపు బంధువుల ఆరోగ్య విషయంలో ఆందోళన చెందుతారు. స్త్రీలు షాపింగ్ వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల మెళుకువ అవసరం.నిర్మాణ పనులలో జాప్యం, అధిక వ్యయం వల్ల ఆందోళనకు గురవుతారు. రావలసిన ధనం వాయిదా పడుట వల్ల ఆందోళనకు గురవ తారు. **కుంభం** : నిరు ద్యోగులకు సదవకాశాలు లభిస్తాయి. మీ యత్నాలకు సన్నిహితులు అన్నివిధాలా సహకారం అందిస్తారు. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్ల తీరు ఆందోళన కలిగిస్తుంది. **మీనం** : మీ సంతానం ఉన్నత విద్యావకాశాల గురించి ఆందోళన చెందుతారు. గృహంలో శుభకార్యం చేయాలనే ఆలోచన స్ఫురిస్తుంది. స్త్రీలు విలువైన వస్త్రాలు, ఆభరణాలు అమర్చుకుంటారు. బంధు మిత్రుల కల యికతో నూతన ఉత్సాహం కానవస్తుంది. గృహంలో మార్పులు, మరమ్మత్తులు చేపడతారు.

## సంకీర్తన

# విశ్వసిస్తేనే భగవద్దర్శనం



భగవంతుడు సాధు రక్షణార్థం, ధర్మ సంస్థాపనార్థం ఏ రూపంలోనైనా గోచరించగలడు. అదే భగవంతుని అవతార విశిష్టత. ఆయనను సంపూర్ణంగా విశ్వసించక పోతే బాధపడక తప్పదు. విశ్వసిస్తే ఆత్మగత సంబంధం ఏర్పడుతుంది. దేవుడి శక్తి మనలో నిండి ఉంటుంది. కనుక అప్పుడు ఎవరిలోనైనా దైవత్వం కనపడుతుంది. ఇలాంటి భావం అందరిలో ఏర్పడకపోవడానికి కారణం, దేవుడు లేడని కాదు మనకు దేవుడు కనపడాలన్న కోరిక బలంగా లేకపోవడం. కోరికలు మహారాజును కూడా కటిక పేదవాడిగా మార్చగలవు.

కనుక భక్తులు కోరికలకు దూరంగా భగవంతుడికి దగ్గరగా ఉండేం దుకు ప్రయత్నించాలి. మనకు అవసరమైనవన్నీ భగవంతుడే అడక్కుండా సమకూరుస్తాడు. మనం కోరుకున్న కోరికలలో ఏవైనా తీర లేదంటే అవి మనకు మేలు చేయనివని దేవునికి అనిపించి ఉండాలి.

అందుకే పరమాత్మ మనకు అనుగ్రహించలేదని తెలుసుకోవాలి. ఈనాడు భగవంతుని గురించి వినడానికి ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు. అయినా వారిలోని అశాంతిని పారదోలు కోలేకుండా వున్నారు. ఎన్నో ఉపదేశాలు వింటున్నారు. ఎన్నో సేవాకార్యక్రమాలు వ్యక్తిగతంగా, సామాజిక పరంగా చేస్తున్నారు. అయినా వారిలో శాంతి లేదు.

వినడమొక్కటే సరిపోదు. భక్తితో భగవంతుడిని సేవించినప్పుడే బ్రతుకు పునీతమవుతుంది. మనః పూర్వకంగా భగవంతుణ్ణి ధ్యానించే వారికి అసంతృప్తి అనేది వుండదు. తన గురించి మనకెంత తెలుసునని ఆయన ఆలోచించడు,

ఆయన కోసం మనమెంత తపిస్తున్నామనేదే ఆయన వీక్షణ. దేవుడు మన భక్తి విషయంలో సదా మేల్కొనేట్టుగా మన పూజలు వుండాలి. అంతేగానీ ఉన్నాడో లేడోనని పది మందిని పోగేసి మీమాంసలు చేయవద్దు. సంశయాత్ము లకు భగవంతుడు సందేహాస్పదుడే! దైవ కార్యా లకు వచ్చే విఘ్నాలను దైవమే పోగొట్టాలి.

తన శక్తి పైన గాక పరమాత్మ శక్తి పైన ఆధారపడి జీవించే వాడు భక్తుడు.

మూడవ నేత్రం ముక్కంటికే గాదు, మనుష్యులందరికీ ఉంది. అదే జ్ఞాన నేత్రం. ఎవరికి జ్ఞాననేత్రం తెరుచు కుంటుందో వారు గర్వాన్ని దగ్ధం చెయ్యగలరు.

సర్వం జ్ఞాన ప్లవే నైవ వృజినం సంతరిష్యసి జ్ఞానమనే తెప్పచే పాపరాశిని దాటగలవని శ్రీకృష్ణుడు గీతలో బోధించాడు. భగవంతుని యందు సంపూర్ణ విశ్వాసం వుంచిన వాడికి జగమంతా వెలుగులే!



# నూతన వధూవరులతో కళకళలాడిన రత్నగిరి



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో శుక్రవారం రత్న గిరి భక్తులతో నవదంపతులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఆశ్వీజ మాసం కావడంతో రాష్ట్రంలో పలుచోట్ల అధికంగా వివా హాలు జరగడంతో అధిక సంఖ్యలో భక్తులు రత్నగిరి చేరుకున్నారు. అలాగే సత్యదేవుని సన్నిధిలో గురువారం అధిక సంఖ్యలో వివాహములు జరగడంతో శుక్రవారం దేవస్థానం అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో అధికారులు వెంటనే స్పందించి తెల్లవారుజామున 5 గంటల నుంచి వ్రతం టికెట్లు ఇవ్వడం ప్రారంభించారు. అనంతరం భక్తులకు శ్రీ స్వామివారి దర్శన భాగ్యం ఉదయం 5-30 నిమిషాలకు కల్పించారు.ఆలయ అధికారులు కరోనా నిబంధనలు కారణంగా వచ్చిన భక్తులను భౌతిక దూరం పాటించే విధంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

# మిలాద్ ఉన్ నబీ సందర్భంగా శానిటైజర్లు, మాస్కుల పంపిణీ

కంచరపాలెం : కరోనా నేపథ్యంలో ఆ వ్యాధి విస్తరించకుండా ప్రజల్ని చైతన్య వంతుల్ని చేయడమే తన లక్ష్యమని సయద్ ఇలియాస్ మహ్మద్ అన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా శుక్రవారం పోలీస్ బ్యారెక్స్ సమీపంలోని దర్గా షరిఫ్ వద్ద ఫతేహా నిర్వహించారు. అనంతరం అక్కడి వారికి శానిటైజర్లు, మాస్కులు ఉచితంగా పంపిణీ చేశారు. ప్రజలుతా క్షేమంగా ఉండాలని, కరోనా నుంచి బయట పడాలంటూ అల్లాను ప్రార్థించానన్నారు. తన తండ్రి ఖాదర్బాబా, సోదరుడు ఇషాక్ మహ్మద్ జ్ఞాపకాలను తల్చుకుంటూ ఈ కార్యక్రమం చేపట్టానని ఆయన స్పష్టం చేశారు. కాలి ఫోర్నియాలో ఉంటున్న తన సోదరి షిరీన్ సుల్తాన్ కూడా సహకరిం చారని, త్వరలో మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపడతా నని సీఐ ఇలియస్ మహ్మద్ హామీ ఇచ్చారు.





## పవర్ గ్రిడ్ కార్పొరేషన్
# విజిలెన్స్ అవేరనెస్ వీక్ కార్యక్రమం



పరవాడ : పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ విశాఖపట్నం నందు విజిలేన్స్ అవరెనేస్ విక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నారు. 400 కేవీ ఉప కేంద్రం ముఖ్య అధికారి సినియర్ జనరల్ మేనజర్ ఎవిఎల్ నరసింహారావు నేతృత్వంలో అధికారులు మరియు ఇతర సిబ్బంది విజిలెన్స్ అవరెనేస్ విక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమం కోవిడ్ -19 వలన ఆన్లైన్ ద్వారా దేశ ప్రధాని మంత్రి మరియు కేంద్ర ముఖ్య విజిలెన్స్ అది. కారుల సందేశాన్ని ప్రతిజ్ఞ ద్వారా తెలియజేశారు. ఈ కార్య క్రమం ఈనెల 27 నుండి నవం బర్ 4 వరకు వారం రోజులు పాటు నిర్వహి స్తామని సంస్థ హెచ్అర్, డిజిఎమ్ అధికారి మాదవ్నాద్ తెలియజేశారు. అవినీతి రహిత సమాజం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# కింతాడలో శ్రమదానం



దేవరాపల్లి : మండలంలోని బోయిల కింతాడ గ్రామంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసన సభ ప్రభుత్వ విప్, మాడుగుల శాసన సభ్యులు బూడి ముత్యాల నాయుడు ఆదేశాల మేరకు యువత స్ఫూర్తితో రెండవ సారి శ్రమదానం కార్యక్రమం చేపట్టారు. గవరవరం గ్రామం నుంచి బోయలకింతాడ సచివాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా తుప్పలను తొలగించి శుభ్రపరిచారు. మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు బూరె బాబు రావు, గ్రామ వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆధ్వ ర్యంలో గ్రామాల్లో ఉన్న ప్రజలంతా పార్టీల కతీతంగా ఏకాభిప్రాయంతో సుమారు రెండు కిలోమీటర్లు ఉన్న రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలు తొలగించారు.

ఈ కార్యక్రమంలో అన్నం రామునాయుడు, అన్నం రాము, అన్నం వెంకట్రావు,కొప్పాక దేముళ్ళు,అన్నంసత్యా రావు, కొప్పాక యతీష్,బొబ్బిలి రాము, గోరపల్లి శ్యామ్,గేదెల జగ్గారావు, ఒమ్మి కుమార్, దువ్వారి అశోక్,సనివాడ వాసు, అన్నం కిరణ్ కుమార్,భయవరపు హరికృష్ణ, కోప్పాక నాగేంద్ర,దేవర శ్రీను,తాటికొండ పరమేష్,దాసరి శ్రీను,దాసరి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ కనుదృష్టి పిల్లలను సమర్థవంతంగా తయారుచేయాలి

### - అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని



విశాఖపట్నం : పుట్టుకతోను,ఇతర కారణాలతోను,తక్కువ దృష్టి కలిగిన పిల్లలను, ప్రభుత్వం అందించే సంక్షేమానికి తోడుగా ప్రభుత్వేతర సంస్థలు చేదోడు,వాదోడుగా నిలిచినపుడే సమర్థ వంతమైన బాలల సమాజం నిర్మించగలమని ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్పీఎఫ్) రాష్ట్ర సైకాలజీ విభాగం ప్రధాన కార్యదర్శి,మానసిక తత్వవేత్త డాక్టర్ ఎన్.సీతారామ కృష్ణారావు రచించిన 'తక్కువ దృష్టి గల పిల్లల కొరకు పరిసరాల మార్పు అనుకరణ'అనే పుస్తకాన్ని శుక్రవారం ప్రభుత్వ అతిథి గృహంలో స్పీకర్ తమ్మినేని సీతారాం ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ పుస్తక రచయిత చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం లో కీలక ప్రతినిధిగా ఎంతో సామాజిక పరిజ్ఞానంతో అతితక్కువ దృష్టి కల్గి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవడం,మరెన్నో లెక్కకు మించి అనుభవాలు,ఆచరణలు, అనుసరణలు,పరిశోధనలు పరిగన లోనికి తీసుకొని దివ్యాంగ బాలలందరికి శత శాతం ఉపయుక్తంగా ఉండేలా రచించారని అన్నారు, వెలకట్ట లేని ఇటువంటి పుస్తకాలును సాటి ప్రభుత్వేతర సంస్థల సహాయ సహకారంతో ముద్రించి లక్షలాదిగా దివ్యాంగ బాలల సమాజానికి,ప్రభుత్వేతర సంస్థలకు చేరువైనప్పుడే ఈ పుస్తక రచనా ఫలాలు అందుతాయన్నారు, ఈ పుస్తకాన్ని రచించిన డాక్టర్ సీతా రామకృష్ణ రావుకు,ఆయనకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారాం తో పాటు ఫోరం అందరి సభ్యులను అభినందిస్తున్నానన్నారు. అనంతరం పుస్తక రచయిత,డాక్టర్ ఎన్.సీతా రామకృష్ణ రావు,సీఆర్పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారాం లు మాట్లాడుతూ బాలల హక్కులు పరిరక్షణ,వారి సంక్షేమం తో పాటు వారి భవిష్యత్ భద్రతపై వివిధ ఉపయుక్త పుస్తకాలను రచించి బాలలకు నేరుగా చేరే ప్రయత్నాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర యునివర్సిటీ దూర విద్యావిధానం డైరెక్టర్ పి. హరి ప్రకాష్,జివిఎం సి జోనల్ కమీషనర్ పి.సింహాచలం, సీఆర్పీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శకుంతల, పి.శేఖర్, కరుణా కర్,బి.ఎల్.రెడ్డి పాల్గొన్నారు.

# నర్సీపట్నం లో గంజాయి పై దృష్టి సారిస్తామన్న హొంమంత్రి

### - మోడ్రన్ పోలీస్ స్టేషన్ ను ప్రారంభం - దిశ స్టేషన్ ఏర్పాటు చేయండి అని కోరిన నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్

**- రాష్ట్రంలో మహిళలు పై అఘాయిత్యాలు, గంజాయిని అరికట్టే దిశగా చర్యలు చేపట్టారు**

**- కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్న పోలీసుశాఖ - రాష్ట్ర హొంమంత్రి సూచరిత**



నర్సీపట్నం : నర్సీపట్నం స్టేనిక పోలీస్ గ్రౌండ్ లో నూతనంగా నిర్మించిన మోడ్రన్ పోలీసుస్టేషన్ ప్రారంభోత్సవం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ ప్రారంభోత్సవం కు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హొంశాఖ మాత్యులు మేకతోటి సూచరిత. ముందుగా హొంమంత్రి సూచరిత నూతన మోడ్రన్ పోలీసుస్టేషన్ ను రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం పలు విభాగాల ముఖ్య అతిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా హొంమంత్రి సూచరిత మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్ సారధ్యంలో రాష్ట్ర డీజీపీ నాయకత్వం లో ఆంధ్రప్రదేశ్ లో పోలీస్ శాఖ ఎంతో అత్యున్నత స్థాయిని దేశంలో ప్రశంసనియమైన స్థానాన్ని పొందడం అందరూ గర్వించదగ్గ విషయం అన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రజలకు సేవచెయ్యడంలో కులం, మతం,ప్రాంతం, రాజకీయ పార్టీలకు అతీతంగా పాలన అందిం చాలన్నట్టు పోలీసుశాఖ వారు కూడా ఎటువంటి తారతమ్యం లేకుండా ఎక్కడైనా అన్యాయం జరిగినా, తప్పుచేసినవారు అధికార పార్టీ వాళ్ళైన వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడంలో ముందున్నారంన్నారు. ఎమ్మెల్యే గణేష్ నర్సీ పట్నంలో దిశ పోలీసుస్టేషన్ ఏర్పాటు చెయ్యా లంటూ ఇచ్చిన వినతిపత్రం పై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి సాధ్యమైనంత త్వరలో ఏర్పాటు దిశగా ప్రయత్నా చేయనున్నట్లు తెలిపారు. నర్సీపట్నం గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి దృష్టి సారించారు గంజాయిని అరికట్టేందుకు కృషిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డి.జి.పి గౌతమ్ సవాంగ్, మంత్రి అవంతి శ్రీనివాసరావు, ఎంపీ డాక్టర్ బీసెట్టి సత్యవతి, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్, వైసీపీ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, డీఐజీ రంగా రావు, రూరల్ ఎస్పీ కృష్ణారావు, ఎఎస్పీ తుహిన్ సిన్హా, సిఐ స్వామినాయుడు, రూరల్ సీఐ అప్పలనాయుడు, ఎస్సైలు లక్ష్మణరావు,రమేష్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కరోనాపై కొవ్వొత్తుల ర్యాలీ

కొయ్యూరు : కరోనా పై కొయ్యూరు మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించి మిమ్మల్ని మీరు రక్షించుకోండి...ఇతరులను రక్షించండి అనే నినాదంతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా మాస్కులు ధరించా లన్నారు. భౌతిక దూరం పాటిస్తూ శానిటైజర్లు ఉపయో గించాలన్నారు. కరోనా వ్యాక్సిన్ వచ్చేంత వరకూ అందరూ అప్ర మత్తంగా ఉండాలని సూచించారు.

# మెడల్ లో పనిచేసిన లేబ్ టెక్నిషియన్లును ప్రభుత్వం ఆదుకోవాలి

**- ప్రభుత్వ ఆసుపత్రుల్లో టెక్నీషియన్ల కొరతను నివారించాలి**

**- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్**



దేవరాపల్లి : మెడల్ సంస్థలో గత అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న లేబ్ టెక్నీషియన్లను ప్రభుత్వ ఆదుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రిలో లేబ్ టెక్నిషియన్ల కొరతను నివారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తుంది. శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షులు డి వెంకన్న ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 2016 లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు మేరుగైన వైద్య పరిక్షలు చేయడం కోసం అడ్డదారిన కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మేడాల్ సంస్థ కు వైద్య పరీక్షలును కట్ట బెట్టింది అప్పటికే వందపడకలు ఆసుపత్రులు నుండి సి హెచ్ సి, పి హెచ్ సిలో లెబ్ టెక్నిషియన్లు లేక కోట్టు మెట్టులాడుతున్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో మేడల్ సంస్థ ద్వారా కొంత మంది లెబ్ టెక్నిషియన్ కాంట్రాక్టు పద్దతి ద్వారా గుర్తింపు పోందిన కోంతమంది నిరుద్యోగులకు నేలకు 6000 రూ,ఇచ్చి లెబ్ టెక్నిషియన్లు ను పెట్టి పనిచేయించింది మేడాల్ సంస్థ పై అదార పడ్డ ప్రభుత్వం పూర్తిగా లెబ్ టెక్నిషియన్లు పోస్టులు భర్తిచేయకుండ,మేడాల్ సంస్థ పై అదారుపడి నెట్టుకు వచ్చింది నిజానికి ఒక రోగికి ఒకటి నుండి పన్నేండు రకాలు పరిక్షలు వరకు చేస్తె దానికి ప్రభుత్వ మేడాల్ సంస్థ కు 350 రూపాయలు వరకు ఇస్తు ప్రభుత్వ వైద్య పరీక్షలు బాద్యతనుండి పూర్తిగా తప్పుకోని మేడల్ సంస్థకు అప్పగించింది ఎంతో మంది లెబ్ టెక్నిషియన్లు ట్రాయినింగ్ అయ్యి ఉపాధి లెక ప్రభుత్వ ఉద్యోగాలు తీయగా మేడాల్ సంస్థ ఇచ్చిన అతితక్కువ జీతంతో పనిచేస్తు నెట్టుకు వచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం మేడాల్ సంస్థకు బిల్లులను నిలుపుదల చేయడం తో జూలై నేలనుండి జీతాలు నిలిచి పోయాయి దింతో లెబ్ టెక్నిషియన్లు ఆసుపత్రులుకు ఎవరు రావడం లెదు అత్యదిక ప్రభుత్వ ఆసుపత్రిలో లెబ్ టెక్నిషియన్లు లెక వైదపరిక్షలు చేయకుండానే డాక్టర్లు వైద్యం చేసెత్తున్నారు అంటే ప్రభుత్వ ఆసుపత్రిలో ఐదు నెలలుగా డాక్టర్లుకు,తోసిన వైద్యం చేస్తూన్నారు తప్ప వైద్య పరీక్షలు చేసి జబ్బును బట్టి వైద్యం చేయడం లెదు అంటే పేదలు ప్రాణాలు లతో ప్రభుత్వం చేలగటం అడుతుంది అన్నది,అర్దమౌతుంది ఆరోగ్యశ్రీ పేరుతో కోట్లాది రూపాయలు కార్పొరేట్ ఆసుపత్రులు కు కట్టబెడుతున్న, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు కు దిక్కు లెదు ప్రాదిమిక ఆరోగ్య కేంద్రాల్లో ఐదు లక్షల పెట్టి యంత్రాలు ను పెట్టి లెబ్ టెక్నిషియన్ పెడెతె అత్యదిక వైద్య పరీక్షలుచేసి పేదలకు వైద్యం అందించవచ్చునని వైద్య నిపుణులు చేబుతున్న ప్రభుత్వం మెడాలాంటి సంస్థలుకు కట్టబెట్టింది ఆరోగ్యశ్రీ పేరుతో కార్పొరేట్ సంస్థలు కు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం పేదలు వైద్యం పట్ల నిర్లక్ష్యం చేస్తుంది ఐదు నేలలు నుండి ప్రభుత్వ ఆసుపత్రిలో లెబ్ టెక్నిషియన్లు లెకుండ వైద్య చేస్తుంది ఇన్నేళ్ల మేడాల్ సంస్థ పై ఆదార పడ్డ వేలాది. మంది లెబ్ టెక్నిషియన్లు ఉపాది పెండింగ్ జీతాలు చెల్లించక రోడ్డున పడ్డారు ప్రభుత్వ ఉద్యోగాలు తీసిన వయోపరిమితి పెరిగి పోవడం అనర్హలు అవుతారు ఇప్పటికే 18 సంవత్సరాలుగా అవుట్సోర్సింగ్ కాంట్రాక్టు పద్దతి లో పనిచేస్తున్న లెబ్ టెక్నిషియన్లు,పర్మినెంట్ చేసి ఉద్యోగ బద్రత కల్పించలేదు ఇప్పుడు మెడాల్ సంస్థ లో పని పని చేసిన వేలాదిమంది లెబ్ టెక్నిషియన్లు రోడ్డున పడ్డారు దీనికి ప్రభుత్వ మే బాధ్యత వహించాలి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో లెబ్ టెక్నిషియన్లు పోస్టులును భర్తిచేయాలి మెడాల్ సంస్థ లో పని చేసిన లెబ్ టెక్నిషియన్లు ఆదుకోవాలని వెంకన్న డిమాండ్ చేశారు.



# పోస్కోతో జరిపిన చర్చ వివరాలు ముఖ్యమంత్రి బహిర్గతం చేయాలి

**- వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పోస్కోకి కట్టబెట్టే చర్య విడనాడాలి - గాంధీ విగ్రహం వద్ద సిపిఐ(ఎం) నిరసన**




విశాఖపట్నం : పోస్కో యాజమాన్యం నిన్న అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైఎస్.జగన్ మోహన్ రెడ్డిని కలిసి వైజాగ్ స్టీల్‌ప్లాంట్-పోస్కో జాయింట్ వెంచర్‌పై చర్చించారు. ఈ చర్యను సిపిఐ(ఎం) పార్టీ గ్రేటర్ విశాఖ నగర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. తక్షణమే పోస్కో యాజమాన్యంతో జరిగిన చర్చ వివరాలు బహిర్గతం చేయాని రాష్ట్ర ముఖ్య మంత్రిని సిపిఐ(ఎం) పార్టీ డిమాండ్ చేస్తున్నది. ఈ భేటీని నిరసిస్తూ శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఐ(ఎం) పార్టీ నిరసన తెలియజేసింది. ఈ నిరసన కార్యక్రమం ఉద్దేశించి సిపిఐ(ఎం) నగర కార్యదర్శి డా. బి.గంగారావు ప్రసంగిస్తూ పోస్కో యాజమాన్యం ముఖ్య మంత్రి భేటిని తీవ్రంగా నిరశించారు. వెంటనే ఈ భేటీలో జరిగిన చర్చను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పోస్కోకి వ్యతిరేకంగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోని కార్మికు, ఉద్యోగు, కార్మిక సంఘాల తో పాటు వివిధ రాజకీయ పార్టీలు తీవ్ర పోరాటం చేస్తున్న విషయం అందరికి తెలిసింది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి పోస్కో యాజమాన్యంతో చర్చించటం దుర్మార్గమని విమర్శించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను జాయింట్ వెంచర్ పేర పోస్కోకి కట్టబెట్టే చర్యలు ముఖ్యమంత్రి విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పోస్కోకి కట్టబెట్టుటమంటే ఆంధ్ర రాష్ట్రానికి ద్రోహం చేసినట్లవుతుందని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి తప్పనిసరిగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అండగా ఉండాలి. పోస్కోతో జాయింట్ వెంచర్‌ను వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పోస్కోపరం చేయటానికి వేగంగా చర్యలు తీసుకుంటున్నది. ఇప్పటికే భూమును మార్కింగ్ చేపించటం, స్టీల్‌ప్లాంట్‌తో పోస్కో ఎంఓయు బవంతంగా ప్రధాన మంత్రి కార్యాయమే చేపించింది. ఇటీవలే జాయింట్ వెంచర్ పేరుతో నిర్మించబోయే గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ హైగ్రేడ్ స్టీల్ ఫీజుబులిటి రిపోర్టు తయారుకి కమిటీని నియమించింది. ఇప్పుడు ఏకంగా పోస్కో యాజమాన్యం రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసి ప్రభుత్వ మద్దతుకోరింది. బిజెపికి బయపడి రాష్ట్ర ప్రభుత్వం పోస్కోకి తలొగ్గుతున్నది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సివస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) నాయకులు ఆర్‌కెఎస్వీ కుమార్, బి.జగన్, ఎం.సుబ్బారావు, ఎం.కృష్ణారావు తదితయి పాల్గొన్నారు.

# వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీ హొమం



అన్నవరం : తూ.గో. జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి కొండపై కొలువైయున్న వనదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం చండీ హొమము ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గం.లకు పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యహ వచనం, అమ్మవారికి మూల, మంత్ర జపములు,సప్తపతి పారాయణములు నిర్వహించారు.11 గం.లకు పూర్ణహుతి గావించారు. పూజా కార్యక్రమాలను కొంపెల్ల మూర్తి, కూచిబొట్ల ప్రసాద్,చిట్టెం నగేష్, చిట్టెం వాసు మరియు వేదపండితులు, అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసి రమేష్ బాబు, ఏఈవో కర్ర.శ్రీనివాస్, ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వేద పండితుల వేద ఆశీర్వా దములు అనంతరం తీర్ధ, ప్రసాదములు అందజేశారు.

# బ్రతుకు బండిపై ఫార్మా రసాయనాలు కాటు

**-పరవాడ పెద్ద చెరువులో అధిక మొత్తంలో చేపలు మృత్యువాత - అందోళనలో రైతులు**

**- నష్టపరిహారము కేటాయించాలి**








పరవాడ : విశాఖపట్నం జిల్లా పరవాడ మండలం లో ఉన్న జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీ పరిశ్రమల నిర్లక్ష్య వైఖరి వలన శుక్రవారం ఉదయం పెద్ద చెరువు లోని చాపలు పెద్ద సంఖ్యలో మృతి చెంది రైతులుకు తీవ్ర నష్టం కలిగించాయి అని వైసిపి సిఇసి సభ్యులు పైల శ్రీనువాసురావు,పరవాడ మాజీ సర్పంచ్ చుక్కరాము నాయుడు, మాజీ ఎంపిటిసి సభ్యులు సిరపురపు అప్పల నాయుడు, పైల రామచంద్ర రావు తెలిపారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారుఅని అన్నారు. ఫార్మా వ్యర్ధ రసాయనాలు చెరువులో కి ప్రవేశిస్తూ ఉండటంతో చేపలకి ఆక్సిజన్ అందక మృత్యువాత చెందుతున్నాయని అయనఆరోపించారు. చెరువులను మత్స్య సంపద మృత్యువాత పడటం పరిపాటిగా మారింది అని అన్నారు.పార్మా కంపెనీలు రైతులు జీవితాలుతో అటలు అడుకుంటానాయి అని అన్నారు.మృతి చెందిన చేపలుకు నష్టపరిహారము కేటాయించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రెడ్డిశ్రీనువాసురావు, చీపురుపల్లిసన్యాశిరావు, వర్రి హరి, చుక్క అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాపురం స్టేషన్ పరిధిలో ప్రత్యేక దాడులు

**- 45 లీటర్ల నాటు సారాయి స్వాధీనం**
**-సారాయి రవాణా చేస్తున్న మోటార్ బైక్ స్వాధీనం**
**- ఒక వ్యక్తి అరెస్టు; మరో ఇద్దరువ్యక్తుల పై కేసులు నమోదు**
**- పాత కేసులలో అరెస్ట్ కాని మరో ముగ్గురు (3)ముద్దాయిల అరెస్టు - మొత్తం(3)కేసులు నమోదు**



పెద్దాపురం : పెద్దాపురం ఎస్ఇబి స్టేషన్ పరిధిలో పెద్దాపురం స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ బ్యూరో అధికారులు, సిబ్బంది, పెద్దాపురం, మండల పరిధి లో దాడులు రూట్ వాచ్ లు నిర్వహించడమైనది. చంద్రమాంపల్లి గ్రామ పరిధిలో రూట్ వాచ్ నిర్వహించగా, విత్తనాల శ్రీను, చంద్రమాంపల్లి అను వ్యక్తి బజాజ్ పల్సర్ మోటార్ బైక్ పై 20 లీటర్ల సారాయిని రవాణా చేస్తూ, సిబ్బంది ని గమనించి సారాయిని, బైక్ ని వదలి తప్పించుకు పారిపోగా, వాటిని స్వాధీన పరచుకుని, అతని పై కేసు నమోదు చేయడ మైనది. పులిమేరు గ్రామ పరిధిలో 5 లీటర్ల సారాయి స్వాధీన పరచుకుని, సదరు కేసులో పారిపోయిన పలివెల నూకరాజు పై కేసు నమోదు చేయడమైనది. మరియు పెద్దాపురం పట్టణ పరిధిలో 20 లీటర్ల నాటుసారాయి తో సిమ్మా లోవకుమారి అను స్త్రీ ని అరెస్టు చేసి కేసు నమోదు చేయడ మైనది. మొత్తం (3) మూడు కేసులు నమోదు చేయడమైనది. మరియు పెద్దాపురం, కట్ట మూరు గ్రామాలలో పాత కేసులలో తప్పించు కుని అరెస్ట్ కాని వేదదాసరి రాజు, కేతా మంగాలక్ష్మి, యర్రా విజయ అను(3)ముగ్గురు వ్యక్తులను పట్టుకుని అరెస్ట్ చేయడమైనది ఈ దాడుల్లో పెద్దాపురం ఎస్ఇబి, ఎస్‌హెచ్‌ఓ ఎం.రామకృష్ణ దాస్, ఎస్ఐలు, .విజయకుమార్. కె.తాతారెడ్డి. మరియు తదితర సిబ్బంది పాల్గొన్నారని ఎం.రామకృష్ణ దాస్ తెలిపారు.

# సాక్షర భారత్ సమన్వయకర్తలను విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలి

**- సమన్వయకర్తల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సకల నాగేశ్వరరావు**




సాక్షర భారత్ సమన్వయకర్తల సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ జిల్లా నాయకులు

చోడవరం : ఏపీ సాక్షర భారత్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పనిచేసిన 21 వేలమంది గ్రామ సమన్వయకర్తల ను ప్రభుత్వం విధుల్లోకి తీసుకోవాలని ఏపీ సాక్షర భారత్ గ్రామ సమన్వయకర్తల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సకల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వెంకన్నపాలెం షిరిడి సాయి ఆలయ సమీపంలో సమన్వయకర్తల జిల్లా సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరాస్యతను పెంపొందించేందుకు 2010లో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి సాక్షర భారత్ ద్వారా సమన్వయకర్తల ను నియమించడం జరిగింది అన్నారు. తొమ్మిదేళ్లపాటు కేవలం రెండు వేల రూపాయలు గౌరవ వేతనం తో గ్రామాల్లో వయోజనులకు విద్యను అందించడంతో పాటు, ప్రభుత్వం చేపట్టిన ప్రతీ కార్యక్రమం లోనూ భాగస్వాముల మై సేవలు అందించామన్నారు. అనంతరం మార్చి 31 2018 వరకు కొనసాగిన మమ్మల్ని టిడిపి ప్రభుత్వం తొమ్మిది నెలల గౌరవ వేతనం బకాయి ఇవ్వకుండానే విధుల నుండి అన్యాయంగా తొలగించింది అన్నారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో మా సమస్యలను వివరించడంతో వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే తమకు న్యాయం చేస్తామని మాట ఇచ్చారన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర పైగా అవుతున్న ఇంతవరకు తమను విధుల్లోకి తీసుకోవడం చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఇచ్చిన మాట ప్రకారం విధుల్లోకి తీసుకోవాలని, లేదా గ్రామ సచివాలయంలో ఉద్యోగ అవకాశం కల్పించి తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ సాక్షర భారత్ గ్రామ సమన్వయ కర్తల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు ఆడారి ప్రసాద్, కార్యదర్శి ఏ రామలింగం, సలహాదారు జె ఎస్ ఆర్ రావు, చోడవరం వి సి ఓ శరగడం శ్రీను, జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన సమన్వయకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 26న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి




అచ్యుతాపురం : కార్మికుల హక్కులు, చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన నవంబర్ 26 దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు పిలుపునిచ్చారు.

శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో బి జయ అధ్యక్షతన మండల స్థాయి సమావేశం జరిగింది. సెజ్ కంపెనీలలో కార్మిక చట్టాలు అమలు, బ్రాండిక్స్ కార్మికులకు 10 వేలు పైన వేతనాలు హామీ అధికారం వచ్చాక కార్మికుల సమస్యలు, రైతుల సమస్యలు గాలికి వదిలేశారన్నారు.

ఈ కార్యక్రమంలో కె వరలక్ష్మి , గణేష్, అప్పల నాయుడు, కృష్ణ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాపురం డిఎల్‌డివో గా బాధ్యతలు స్వీకరించిన కెఎన్‌వి ప్రసాద్

*అనంతరం రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.మల్లిబాబును మర్యాద పూర్వకంగా కలిసిన డిఎల్‌డివో*



పెద్దాపురం : స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించడానికి ఎన్నికల కమిషన్ సూచించిన సూచనల ప్రకారం ప్రతీభారత పౌరుడు ఓటు హక్కును కలిగి ఉండాలని ఆర్డీవో ఎస్.మల్లిబాబు తెలిపారు. గురువారం పెద్దాపురం సుధా ఆగ్రో ఆయిల్ అండ్ కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2020, ఓటర్లను చైతన్య పరచడం మరియు భాగస్వామ్యం చేయడం కోసం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పరిశ్రమలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భారతదేశం ప్రజాస్వామ్య దేశమని, ప్రజలు ఓటు వేసి ఎన్నుకున్న ప్రభుత్వమే పాలిస్తుందని అన్నారు.ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్ దే ప్రధాన పాత్రయని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును కలిగి ఉండాలనే దృక్పథంతో ఎన్నికల కమిషన్ స్వచ్ఛమైన ఓటరు జాబితాను రూపొందించడానికి ప్రజలను చైతన్య పరచడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజాస్వామ్యానికి ఓటే వజ్రాయుధమని తెలిపారు. చాలామంది ఓటు నమోదు, మార్పులు, ఓటు బదిలీలు, తదితర అంశాలపై అవగాహన లేక ఓటు హక్కును కోల్పోతున్నారని అన్నారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం-6, శాసనసభ నియోజకవర్గం నుండి వేరే శాసనసభ నియోజకవర్గానికి మార్చుకోవడానికి ఫారం-7, ఓటరు జాబితాలో పేరు తొలగింపు కోసం ఫారం-8, ఓటర్ల జాబితాలో ఎంట్రీ లలో మార్పులు ఫారం-8ఏ, తదితర అంశాలపై పూర్తి సమాచారాన్ని యూనిట్ సిబ్బందికి, కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సుధా ఆగ్రో ఆయిల్ అండ్ కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ జూనియర్ ఎండి ఇవి. సుధాకర్, ఫ్యాక్టరీ సిబ్బంది, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# అరకులోయ పట్టణ కేంద్రంలో కోవిడ్ అవగాహన ర్యాలీ




అరకులోయ : అరకు పట్టణ కేంద్రంలో సాయంకాలం కోవిడ్-19 అవగాహన ర్యాలీ కార్యక్రమాలు చేపట్టారు.ర్యాలీ అవగాహన కార్యక్రమం పెదలబుడు పంచాయతీ కార్యదర్శి శేఖర్ బాబు ఆధ్వర్యంలో చేశారు.ఈ ర్యాలీ కార్యక్రమంలో పెదలబుడు సచివాలయం సిబ్బంది మరియు గ్రామ వాలంటీర్ లు గ్రామస్తులు తదితరులు పాల్గొని "నో మాస్క్ నో ఎంట్రీ,మిమ్మల్ని మీరే రక్షించుకోండి,ఇతరులను రక్షించండి అని నినాదాలు చేశారు.

# భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా



విశాఖపట్నం : జివియంసి ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు ఎం. రవీంద్ర మాట్లాడుతూ స్వంత ఇళ్ళు అనేది ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబాల కల అని, ఆ కలని సాకారం చేసేందుకు మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ ఒక గొప్ప ఆశయంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రధానమంత్రి ఆవాస్ యోజన అనే పథకాన్ని ప్రవేశపెట్టి 2022 వ సంవత్సరానికల్లా దేశంలో ప్రతి ఒక్కరికి స్వంత ఇళ్ళు ఉండాలని పథకాన్ని ప్రవేశపెట్టారు కానీ, రాష్ట్ర ప్రభుత్వం తమ స్వప్రయోజనాల కోసం ఇదివరకే మంజూరు అయిన ఇళ్ల కోసం డిడిలు చెల్లించిన కూడా, గత ప్రభుత్వాలు కేటాయించిన ఇళ్ళు అన్నింటిని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇటీవల జివియంసి కమిషనర్ సృజన ఇదివరకు డిడిలు కట్టిన ఇళ్ళు అన్నిటిని రద్దు చేసి మళ్ళీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పడం జరిగిందని, ఇది చాలా తప్పుడు నిర్ణయం అని అన్నారు. ఇదివరకే ఈ ప్రక్రియలో భాగంగా దరఖాస్తుదారుల వివరాలన్నీ పరిశీలించి లబ్దిదారులనుంచి డిడిలు కట్టించుకొని ఇప్పుడు రద్దు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కల ఏమనగా మనకు స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయ్యేసరికి ప్రతి ఒక్కరికి స్వంత ఇళ్ళు ఉండాలనే ఉద్దేశ్యంతో 2015 జూన్ లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పిఎంఏవై పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా ప్రతి ఒక్కరు అద్దె ఇంటిలో కాకుండా స్వంత ఇల్లు ఉండాలనే భావనతో ఈ పథకాన్ని మొదలుపెట్టారు. ఈ పథకం ద్వారా నిర్మించే ప్రతి ఇంటికి కేంద్ర ప్రభుత్వం లక్షన్నర రూపాయలు సబ్సిడీ మరియు రాష్ట్ర ప్రభుత్వం లక్షన్నర రూపాయలు సబ్సిడీ ఇస్తూ ప్రభుత్వ స్థలాలలోనే ఇళ్ళు నిర్మించదలచాలని గత ప్రభుత్వం మంచి ప్రయత్నం చేసిందని అన్నారు. ఈ ప్రయత్నంలో భాగంగా మన రాష్ట్రానికి 2,13,000 ఇళ్ళు కావాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కోరగా కేంద్ర ప్రభుత్వం 1,96,000 ఇళ్లను కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడు గారు కేటాయిస్తున్నట్లు ప్రకటించారని, 1,96,000 ఇళ్లను మంజూరు చేయడం దేశంలో ఏ రాష్ట్రానికి కూడా అంతపెద్ద మొత్తంలో ఇళ్లను మన రాష్ట్రానికి కేటాయించారని, ఇంకా మన రాష్ట్రానికి ఇళ్ళు కావాలని కేంద్రాన్ని అడగగా మళ్ళీ కేంద్ర ప్రభుత్వం 5,00,000 ఇళ్లను కేటాయించిందని మొత్తంగా సుమారు 7,00,000 ఇళ్లను మన రాష్ట్రానికి కేంద్రం కేటాయించిందని అన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 4,74,000 ఇళ్ళు నిర్మాణానికి టెండర్లు పిలవడం జరిగిన కూడా రకరకాల ఇబ్బందుల వలన 170 ప్రాంతాలలో 94 మునిసిపాలిటీలలో 3,13,832 ఇళ్ళు మాత్రమే 170 ప్రాంతాలలో నిర్మాణం మొదలయిందని అన్నారు. వాటిలో సుమారు 80,000 ఇళ్ళు నిర్మాణం ఇదివరకే పూర్తి అయిందని అన్నారు. మిగిలిన ఇళ్ళు నిర్మాణ దశలోనే ఉన్నా యన్నారు. కానీ ప్రస్తుతం మన రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క అంగుళం కూడా ఇళ్ల నిర్మాణం ముందుకు వెళ్లలేదని అన్నారు. ఈ పథకంలో విశాఖపట్నానికి ఏపీ టిడ్కో సంస్థ మొత్తం 57,499 టెండర్లను పిలవగా రాష్ట్ర ప్రభుత్వం 28,156 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టిందని అన్నారు. ఈ పథకంలో అర్హులైన లబ్ధిదారుల నుండి డిడిలు కట్టించుకొని ఒకటిన్నర సంవత్సరాల తరువాత రద్దు చేసి ఇప్పుడు మళ్ళీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పడం దారుణాతిదారుణమని అన్నారు. జివియంసి పరిధిలో అర్హులైన లబ్ధిదారులు ఒకటిన్నర సంవత్సరం క్రితం రూపాయలు 500 /25000 /50000 /75000 /100000 చొప్పున ప్రభుత్వానికి డబ్బులు కట్టడం జరిగింది. చాలామంది లబ్ధిదారులు ఈ డబ్బును ప్రైవేట్ వ్యక్తుల దగ్గర అధిక వడ్డీలకు అప్పు తెచ్చి ప్రభుత్వానికి కట్టడం జరిగింది. ఈ ఒకటిన్నర సంవత్సర కాలంలో ఇంకా వడ్డీలు చెల్లిస్తూనే ఉన్నారు. కానీ, ఇళ్ల మంజూరులో ఎటువంటి పురోగతి కనబడకపోగా, ఇప్పుడు అకస్మాత్తుగా ఇదివరకే మంజూరు అయిన ఇళ్లను రద్దు చేస్తూ, మళ్ళీ కొత్తగా దరఖాస్తు చేసుకోమని ఆదేశాలు జారీ చేయడం సరి కాదని, ఒకవేళ లబ్ధిదారులు కట్టిన సొమ్మును తిరిగి వెనక్కి ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లయితే, లబ్ధిదారులు చెల్లించిన సొమ్ముకు 24 శాతం వడ్డీని కలిపి లబ్ధిదారులకు చెల్లించాలని, లేనియెడల డబ్బులు కట్టిన వారందరికీ తక్షణమే ఇళ్లను కేటాయించాలని కోరారు. ఈ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి గారు పునరాలోచించుకోవాలని లేదంటే తీవ్రమైన ప్రజాగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



కోవిడ్ -19 నియంత్రణకై కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న జేసీ డా.కె.శ్రీనివాసులు, డియంఅండ్‌హెచ్ఓ చంద్రనాయక్, అదనపు డియం అండ్ హెచ్ఓ బగాది జగన్మాథం, మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య

# రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలి



గాజువాక: స్టీల్ ప్లాంట్ భూములను పోస్కోకు కేటాయించడం పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్టీల్ గుర్తింపు యూనియన్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ అఖిలపక్షల కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం గాజువాక సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు.ఈ రౌండ్ టేబుల్ సమావేశం నుంచి నాయకులు ప్లాంట్ భూములను పోస్కోకు అప్పగిస్తారా లేక వ్యతిరేకిస్తారా అన్నది స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గుర్తింపు యూనియన్ అధ్యక్షులు జె. అయోధ్య రామ్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్రారంభం నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవతితల్లి ప్రేమనే ప్రదర్శించించడం గమనార్హం అని ఆయన అన్నారు. ప్రస్తుతం మోదీ పాలనలో దేశభక్తి ముసుగులో ప్రభుత్వరంగాన్ని దేశవిదేశి పెద్దలకు అప్పగించడం లో భాగమే పోస్కోతో ఒప్పందం అని ఆయన వివరించారు. దేశ ఆర్థిక స్వాతంత్ర్యంన్ని, అభివృద్ధి కోసం చేస్తున్న పోరాటమే పోస్కో వ్యతిరేక ఉద్యమం అని ఆయన అన్నారు. కనుక ఈ పోరాటంలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలి ఆయన కోరారు. స్టీల్ ఇంటక్ అధ్యక్షులు గంధం వెంకట్రావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ప్రధాని కార్యాలయం ఆదేశాలతో పోస్కోతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఆనాడు ఇక్కడ ప్రజలు తమ జీవనోపాదిని త్యాగం చేసి ఈ ప్రాంత అభివృద్ధిని కోరుకున్నారని ఆయన వివరించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న స్టీల్ ప్లాంట్ భూములను పోస్కోకు కేటాయించడం పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

స్టీల్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి వై. టి. దాస్, స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు జె.సింహాచలం, డి.వి.రమణారెడ్డి, టి.జగదీష్, అచ్చింనాయుడు, దరివి రవి, దొమ్మేటి అప్పారావు, తదితరులు మాట్లాడుతూ కోవిడ్ కారణంగా ప్రజలు తమ విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని వారు అన్నారు. ఇదే సమయంలో ప్రజాసంపదను దోచుకుతినే రాబందులకు అండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని వారు తీవ్రంగా విమర్శించారు. త్యాగాలతో సాధించుకున్న మన ప్లాంట్ ను కాపాడుకోవడానికి మా ప్రాణాలను కూడా లెక్క చేయమని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్టీల్ అఖిలపక్ష నాయకులు టి. వి. కె. రాజు, కె. వి. సత్యనారాయణ, కొవిరి అవతారం, మొహానకుమార్,రమణమూర్తి, వి. ప్రసాద్, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాలనా వికేంద్రీకరణకు సచివాలయ వ్యవస్థ




శ్రీకాకుళం : పాలనా వికేంద్రీకరణకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారని రాష్ట్ర శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మండలం బెలమాంలో రైతు భరోసా కేంద్రానికి, లొద్దిపేటలో వై.యస్.ఆర్ హెల్త్ క్లినిక్ కు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రజలకు చేరువలో పాలన తీసుకువచ్చారని అన్నారు. సచివాలయంలో 13 శాఖల సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. రైతుల ఆత్మ గౌరవం ఇనుమడింప జేయుటకు ప్రత్యేకంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిన ఘనత జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాంకేతిక సలహాలు అందుతాయని వివరించారు. హెల్త్ క్లినిక్ ల వలన గ్రామాల్లో ప్రాథమిక వైద్యం అందుతుందని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమ ప్రభుత్వం అన్నారు. పేదలు అందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్ళు కట్టించాలని ముఖ్యమంత్రి సంకల్పించారని, అయితే అనివార్య కారణాల వల్ల కోర్టులో ఉందని పేర్కొన్నారు. ప్రతి వర్గానికి లబ్ది చేకూర్చాలని అనేక పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పతంజలి యోగాపీఠ్ హరిద్వార్ ఆధ్వర్యంలో
# 100 గంటల ఆన్‌లైన్ ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం

భీమునిపట్నం: ఆంధ్రప్రదేశ్ పతంజలి యోగ సమితి, పతంజలి యోగా పీఠ్ హరిద్వార్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ఉపాధ్యాయ శిక్షణ 2వ శిబిరం నవంబర్ 5 నుంచి ప్రారంభమవుతుందని నిర్వాహకులు ఏ.ఎస్ రవి, టి.ఎస్.వి ప్రసాదరావులు తెలిపారు. శిక్షణ ఉదయం ఐదున్నర గంటల నుంచి ఏడున్నర గంటల వరకు,సాయంత్రం ఐదున్నర గంటల నుంచి 7.30 గంటల వరకు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యోగా ఒరిజినల్ కాన్సెప్ట్, అష్టాంగ యోగ, పంచకర్మ ,ఆయుర్వేద థెరపి, అనాటమీ, వేద పురాణ ఉపనిషత్తుల, గీత దర్శనం, హఠ యోగా ,రోగానుసర యోగా, హెూమ్ మెడిసిన్ ఉంటాయని చెప్పారు. స్వామి రాందేవ్ మహారాజ్ పతంజలి యోగ పీఠ్ హరిద్వార్ యొక్క అత్యంత యోగి పేజ్, భారత ప్రభుత్వ ఆయుష్ విభాగం డైరెక్టర్ ఈశ్వర్ బసవ రెడ్డి, కేంద్ర పతాంజలి ప్రముఖులు దేవిప్రియ, దక్షిణ భారతదేశ ఇన్చార్జ్ బవర్లాల్ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీచర్ ట్రైనింగ్ ఇన్చార్జి బాలసుబ్రహ్మణ్యం, పతంజలి యోగ పీఠ్ కు సంబంధించిన అనుభవజ్ఞులైన యోగా నిపుణులు శిక్షణ ఇస్తారని అన్నారు. కరోనా కాలంలో యోగ, ప్రాణాయామం, ఆయుర్వేద చికిత్స పద్ధతులు, ప్రతిభావంతంగా ఉన్నాయని శాస్త్రీయంగా నిరూపించబడిందనీ అన్నారు.

ఈ కారక్రమంలో పాల్గొనే వారికి యోగా సర్టిఫికెట్ బోర్డు (వైసిపబి) స్థాయి 1(యోగ బోదకుడు) స్థాయి2 (యోగవెల్నెస్ బోదకుడు) మరియు స్థాయి 3 (యోగా ఉపాధ్యాయ మూల్యాంకనం) పరీక్షల్లో భారత ప్రభుత్వ ఆయుష్ విభాగం కింద ఇస్తారని, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు రంగంలో ఉద్యోగ ఉపాధ్యాయులను నియ మించేటప్పుడు ఈ ధ్రువపత్రాలకు ప్రాధాన్యత ఉంటుందనీ తెలిపారు. మరిన్ని వివరాలకు ఈ క్రింది సెల్ 6301413438, 9246625331 నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

## సాంస్కృతికి చిహ్నంగా..

విశాఖపట్నం : వినియోగదారులకు అందుబాటులో రిలయన్స్ జ్యువెల్స్ నూతన ఉత్కళ సేకరణను ఆవిష్కరించనట్టు రిలయన్స్ జ్యువెల్స్ ప్రతినిది తెలిపారు. ఒడిశా యొక్క ప్రత్యకమైన కళాత్మక సాంస్కృతిక సంప్రదాయాలచే ప్రేరణ పొందిన అద్భుతమైన బంగారు వజ్రాల ఆభరణాల శ్రేణిగా తెలిపారు. రాష్ట్ర కళ, సాంప్రదాయం సాంసృతి పరిపూర్ణతకు ప్రతిబింబించే విలక్షణమైన మూలాంశాలు, అద్భుతమైన డిజైనలు కలిగి ఉందన్నారు.

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM**
**O.S.1396/2019**

Between:
M/s. Varun Finance,
Rep.by its Special Power of Attorney Holder,
Kondra Anand. ...Plaintiff
And:
Gorle Soma Sankar Sreedhar & Another ... Defendants

**NOTICE**

To,
**D-2) Nadigotla Mohan Rao, S/o Sundara Rao,**
**Hindu, aged 43 years,**
**D.No.4-20, Yenugubayalu (Village),**
**G.K.Veedhi (Mandal), Darakonda (Post),**
**Visakhapatnam-531105.**

Please take notice that the above named plaintiff has instituted the above suit against you. You are hereby summoned to appear in the above court in person or through a pleader duly instructed, and the matter stands posted to **10-11-2020 at 10.30 AM** for your appearance, in default of your appearance on that day the suit will be heard and determined in your absence basing on the material available in the Court.

**Tulala Venkateswara Rao,**
**Kurumuji Koteswara Rao,**
**Advocates**
**Ramnagar**
**Visakhapatnam-02.**
**Cell No: 9985747149**

# విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో రేడియో ధార్మికత లీకేజీపై మాక్‌డ్రిల్







గాజువాక: జె.శివశంకర్ రెడ్డి , జాయింటు చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫేక్టరీస్ సమక్షంలో, అణుధార్మికత లీకేజీపై విశాఖపట్నంలోనే మొట్టమొదటి సారిగా మాక్ డ్రిల్లును శుక్రవారం విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో నిర్వహించారు. మాక్ డ్రిల్లులో భాగంగా, ఒక కార్మికుడు ఐసోటోపు నిలువవుంచిన గది శుభ్రం చేస్తుండగా అనుకోకుండా కోబాల్టు60 (రేడియో ధార్మికత కలిగిన పదార్ధం) మూతను తెరిచేస్తాడు. దానినుండి వెలువడిన రేడియో ధార్మికత వలన నలుగురు కార్మికులు ప్రభావితమయి పడిపోతారు. ఈ సంఘటన తరువాత జరిగే పరస్పర సమాచార పంపిణీ, ఆ కార్మికులను రక్షించడము,ఆ ప్రభావిత పరిసరాలు ఖాళీ చేయించడము మొదలైన చర్యలన్నీ చాలా పకడ్బందీగా చేసి చూపించారు మాక్ డ్రిల్లులో.

రేడియో ధార్మికతకు గురైన కార్మికులను రక్షించడంలోనూ, ఆపరిసరాలను ఖాళీ చేయించడములోనూ "జాతీయ విపత్తు నివారణా బలగం (ఎన్.డి.ఆర్.ఎఫ్.)'' ముఖ్య పాత్ర పోషించింది. పరస్పర సహకార సూత్రానికి లోబడి దగ్గరున్న ఇతర పరిశ్రమలైన, ఎన్.టి.పి.సి. మరియు హిందుజా సంస్థలు వైద్య సహాయం అందించాయి. విశాఖపట్నం జిల్లాలోనే మొట్టమొదటి సారిగా రేడియో ధార్మికతపై విజయవంతంగా మాక్ డ్రిల్లు నిర్వహించిన తొలి పరిశ్రమగా ఆర్.ఐ.ఎన్.ఎల్.- విశాఖ ఉక్కు నిలిచిందని శ్రీ జె.శివశంకర్ రెడ్డి , జాయింటు చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫేక్టరీస్ కొనియాడారు. అనంతరం కె. విద్యాసాగర్, ఇ.డి.(వర్క్స్), ఇంఛార్జు, చీఫ్ ఎమెర్జెన్సీ కంట్రోలర్, ఆర్.ఐ.ఎన్.ఎల్. మాక్ డ్రిల్లు పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్లు ఏర్పాట్లు చూసిన జి.ఎం.(ఎస్.అండ్ ఇ), ఇంఛార్జు, ఆర్.ఐ.ఎన్.ఎల్. మాక్ డ్రిల్లును విజయవంతం చేసినవారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM**
**O.S.1317/2019**

Between:
M/s. Varun Finance,
Rep.by its Special Power of Attorney Holder,
Kondra Anand. ...Plaintiff
And:
Ayinampudi Srinivasa Raju & Another ... Defendants

**NOTICE**

To,
**D-2) Denumkonda Bangaru Raju,**
**S/o.Tata Raju, Hindu, aged 38 years,**
**Vempadu (Village), Nakkapalli (Mandal)**
**Visakhapatnam District-531081.**

Please take notice that the above named plaintiff has instituted the above suit against you. You are hereby summoned to appear in the above court in person or through a pleader duly instructed, and the matter stands posted to **09-11-2020 at 10.30 AM** for your appearance, in default of your appearance on that day the suit will be heard and determined in your absence basing on the material available in the Court.

**Tulala Venkateswara Rao,**
**Kurumuji Koteswara Rao,**
**Advocates**
**Ramnagar,**
**Visakhapatnam-02.**
**Cell No: 9985747149**

# సీఎం పోలీస్ శాఖకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు

## సొంత పార్టీ వాళ్ళు తప్పు చేసినా శిక్షలు వేయాలని సీఎం ఆదేశించారు

### హోంమంత్రి మేకతోటి సుచరిత



అనకాపల్లి : అనకాపల్లి మోడల్ పోలీస్ స్టేషన్ ను హోంమంత్రి మేకతోటి సుచరిత ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే గుడివాడ అమర్నాథ్, డీజీపీ గౌతం సవాంగ్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు, పాల్గొన్నారు. అనకాపల్లి మోడల్ పోలీస్ స్టేషన్ జరిగిన పూజా కార్యక్రమంలో హోంమంత్రి పాల్గొని, పోలీస్ స్టేషన్ ను పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశంలో హోంమంత్రి సుచరిత మాట్లాడటం జరిగింది. మేకతోటి సుచరిత - హోంమంత్రి... అధికారంలో కి వచ్చిన వెంటనే సీఎం జగన్ పోలీస్ శాఖకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. తప్పు చేసిన ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదనని సూచించారు. సొంత పార్టీ వాళ్ళ తప్పు చేసినా శిక్షలు వేయాలని సీఎం ఆదేశించారు. టెక్నాలజీ వినియోగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ శాఖ దూసుకుపోతోంది దేశములోనే మన రాష్ట్ర పోలీవులకు అత్యధిక అవార్డ్ లు వస్తున్నాయి.



జాతీయ స్థాయిలో 84 అవార్డ్ లు వస్తే, వాటిలో 48 అవార్డ్ లు మన రాష్ట్ర పోలీసులకు రావడం నిజంగా గర్వకారణం. పోలీస్ శాఖ ఎంతటి నిబద్ధతతో పనిచేస్తే..ఇన్ని అవార్డ్ లు వస్తాయో ఆలోచించాలి. గతంలో మాదిరిగా కక్ష పూరిత, అక్రమ కేసులు పెట్టె పరిస్థితి మన ప్రభుత్వంలో లేదు. పోలీసు శాఖ పూర్తి స్వేచ్ఛగా, న్యాయ బద్ధంగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారు. కరోనా, లాక్ డౌన్ సమయంలో ఆంధ్రప్రదేశ్ పోలీసు సేవలు మరువలేనివి. పోలీసులు తమ కుటుంబాన్ని పక్కన పెట్టి రోడ్లపై డ్యూటీ లు చేశారు. ప్రాణాలకు తెగించి కరోనా విపత్కర సమయంలో పోలీసులు పనిచేశారు. చాలా మంది పోలీసులు కరోనా భారిన పడి మరణించిన సందర్భాలు కూడా ఉన్నాయి. పోలీసులు ఎంతో నిబద్ధతతో పనిచేయడం వలనే మరణాల సంఖ్య తగ్గిందని గణాంకాలు చెబుతున్నాయి. మన గౌరవ ముఖ్యమంత్రి గారు మహిళల భద్రత కు పెద్దపీట వేశారు. అందులో భాగంగా మన రాష్ట్రంలో 18 దిశ పోలీస్ స్టేషన్ లను ప్రారంభించాము. త్వరతిగతిన కేస్ లు పరిష్కరించడం కోసం కొత్త కొత్త టెక్నాలజీని ఉపయోగిస్తున్నాము.

దిశ యాప్, ఏపి పోలీస్ సేవ యాప్, ఇలా అనేక కొత్త అవిష్కరణలను తీసుకొచ్చాము. ఏపీ పోలీస్ సేవా యాప్ ద్వారా ప్రజలు దాదాపు 67 రకాల సేవలను పొందవచ్చును. మన రాష్ట్రంలో జీరో ఎఫ్ ఐ ఆర్ ను కు తీసుకురావడం జరిగింది. దేశంలో ఎక్కడా లేని విధంగా పోలీసులకు వీక్లీ హాఫ్ ను సీఎం ప్రకటించారు. కార్పొరేట్ బిల్డింగ్ లను తలదన్నేలా మోడల్ పోలీస్ స్టేషన్ లను ఏర్పాటు చేసాము. ప్రజలు ధైర్యంగా, స్వేచ్ఛా వాతావరణంలో వెళ్లేలా పోలీస్ స్టేషన్ లు



తయారయ్యాయి. రానున్న రోజుల్లో మరింత ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ ను తీసుకొస్తాము. ప్రతి గ్రామ సచివాలయంలో మహిళా పోలీస్ ను నియమించడం జరిగింది. పోలీస్ వ్యవస్థలో మహిళలకు సముచిత స్థానం కల్పించిన సీఎం కి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బూడి ముత్యాల నాయుడు, ఎంపీ బీసెట్టి సత్యవతి ,ఎమ్మెల్యే గుడివాడ అమర్నాథ్ ,డీజీపీ గౌతమ్ సవాంగ్, డి ఐ జి రంగా రావు, ఎస్పి కృష్ణారావు, డిఎస్పీ శ్రావణి, సిఐ లు లంకా భాస్కరారవు, నర్సింహారావు, ఎస్ఐలు రామకృష్ణ, రాము, దనుంజయ్, స్వీటీ, స్వామినాయుడు, వైసీపీ నాయకులు మళ్ల బుల్లిబాబు, దంతులూరి దిలీప్ కుమార్, మందపాటి జానకిరామరాజు, పలకా రవి, ఆళ్ల నాగేశ్వరరావు, జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాక్సిన్ పంపిణీకి సంసిద్ధంగా ఉండండి..!

### అన్ని రాష్ట్రాలకు లేఖ రాసిన కేంద్ర ఆరోగ్యశాఖ



దిల్లీ: కరోనా వ్యాక్సిన్ వచ్చిన వెంటనే.. దాన్ని దేశవ్యాప్తంగా పంపిణీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను సమన్వయం, పర్యవేక్షణ కోసం కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని అన్ని రాష్ట్రాలకు సూచించింది. అంతేకాకుండా వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగే సమయంలో ఇతర ఆరోగ్య సేవలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని తెలిపింది. ముఖ్యంగా టీకా పంపిణీని, వాటి అంగీకారాన్ని ప్రభావితం చేయగలిగే వదంతులపై సామాజిక మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు ట్రాక్ చేయాలని మరోసారి స్పష్టంగా పేర్కొంది.

దాదాపు సంవత్సరం పాటు కొనసాగే ఈ టీకా ప్రక్రియ, తొలుత ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలతోనే ప్రారంభమవుతుందని కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. అనంతరం ఇది దేశంలోని అన్ని గ్రూపులకు విస్తరిస్తామని పేర్కొంది. ఇందుకోసం రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. వ్యాక్సిన్ పంపిణీకి కావాల్సిన శీతల కేంద్రాల సన్నద్ధత, కార్యాచరణ ప్రణాళిక, విభిన్న భౌగోళిక ప్రాంతాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ కమిటీలు నిరంతరం పర్యవేక్షిస్తాయని తెలిపింది. తాజాగా వీటి మార్గదర్శకాలపై అన్ని రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర ఆరోగ్యశాఖ లేఖ రాసింది.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా స్టేట్ స్టీరింగ్ కమిటీ(ఎస్-ఎస్‌సీ), ఆరోగ్యశాఖ అడిషనల్ సెక్రటరీ నేతృత్వంలో రాష్ట్ర టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్), జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్ ఫోర్స్(డీటీఎఫ్) కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి రాజేష్ భూషణ్ అన్ని రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖ రాశారు. కరోనా వ్యాక్సిన్‌పై సామాజిక మాధ్యమాలతోపాటు ఇతర మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను సాధ్యమైనంత తొందరగా గుర్తించాలని లేఖలో మరోసారి స్పష్టం చేసింది.

## ఏపీలో రికార్డు స్థాయిలో కరోనా పరీక్షలు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో రికార్డు స్థాయిలో కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 79,46,860 సాంపిల్స్‌ను పరీక్షించినట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ హెల్త్‌బులెటిన్‌లో పేర్కొంది. కాగా గడిచిన 24 గంటల్లో 84,401 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. కొత్తగా 2,886 మందికి కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో ఏపీలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 8,20,565కి చేరింది. కరోనా నుంచి కొత్తగా 3,623 మంది కోలుకోగా.. మొత్తం డిశ్చార్జి అయిన వారి సంఖ్య 7,88,375గా ఉంది. 24 గంటల్లో కరోనాతో 17 మంది మరణించగా.. మొత్తం మరణాల సంఖ్య 6,676కు చేరుకుంది.

# ఏపీలో నవశకం మొదలవుతుంది..

### వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి



అమరావతి: కడప స్టీల్ ఫ్యాక్టరీతో పారిశ్రామికంగా ఆంధ్రప్రదేశ్‌లో నవశకం మొదలవుతుందని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ట్విట్టర్‌లో పేర్కొన్నారు.30 వేల మందికి ఉపాధి కల్పించనున్న ఈ కర్మాగారం.. వెలుగు దివ్వెలా అభివృద్ధికి దారి చూపుతుందని తెలిపారు. కొరియన్ ఉక్కు దిగ్గజం పోస్కో ప్రభుత్వ చొరవను ప్రశంసించడం.. సీఎం జగన్ సంకల్పాన్ని బలపర్చినట్లైందని ఆయన ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు.

## విజయసాయిరెడ్డి ని కలిసిన నగరాల కార్పొరేషన్ సభ్యులు



మధురవాడ : వైఎస్ఆర్.సి.పి జాతీయ కార్యదర్శి,రాజ్యసభ సభ్యులు వి.విజయసాయి రెడ్డిని ప్రభుత్వ అతిధి గృహంలో మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర నగరాల కార్పొరేషన్ సభ్యులు, ఈ సందర్భంగా చైర్ పర్సన్ పిళ్ళా.సుజాత, పిళ్ళా సత్యనారాయణ దంపతులు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బీసీ లకు ప్రాధాన్యం కల్పించారని, కార్పొరేషన్‌ల ఏర్పాటు ద్వారా అణగారిన బీసీ కులాల్లో ఆత్మ విశ్వాసం పెరిగిందని, నగరాల కార్పోరేషన్ చైర్ పర్సన్ గ నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు అలాగే ప్రభుత్వ పథకాలు కార్పొరేషన్ ద్వారా అర్హులకు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వాండ్రాసి శ్యామల, కె.లోహిత్,బి.మీనాక్షి,జి.లలిత, ఎన్.పార్వతి, బి.అచ్యుతాంబ,7వ వార్డు మహిళా అధ్యక్షురాలు ఎమ్.రాజేశ్వరి, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాలను పరిపుష్టం చేయాలి

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ధర్మాన క్రిష్ణ దాస్



శ్రీకాకుళం : వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి సహకార సంఘాల ను పరిపుష్టం చేయాల్సి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ధర్మాన క్రిష్ణ దాస్ అన్నారు. నరసన్నపేట నియోజకవర్గం సారవకోటలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పి.ఏ.సి.ఎస్) మొదటి అంతస్తు నూతన భవనాన్ని ఉప ముఖ్యమంత్రి శు క్రవారం ప్రారంభించారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి బలమైన సంకల్పంతో ఉన్నారని చెప్పారు. ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత రంగాలలో విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం ఉన్నాయని తెలిపారు. సహకార సంఘాల ద్వారా ఈ ఏడాది కస్టమ్ హైరింగ్ సెంటర్ లు, కస్టమ్ హైరింగ్ హబ్ లను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతి ఆర్.బి.కే లో ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్ ఉండేలా ఏర్పాటు చేస్తున్నామని, రూ.15 లక్షల వరకు విలువ చేసే వ్యవసాయ యంత్రాలు పనిముట్లు ఇక్కడ అందుబాటులో ఉంటాయని వివరించారు. వీటిని అద్దె ప్రాతిపదికన రైతులకి అందజేస్తామని తెలిపారు. రైతులు కూలీల కొరత సమస్య నుంచి బయటపడవచ్చని సూచించారు. ఈ యంత్రాలు కొనుగోలు చేసేందుకు డిసిసిబి ఆర్థిక సహాయం చేస్తుందని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకు అద్దెకు పరికరాలను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. బ్యాంకు రుణం చెల్లింపు పూర్తి అయిన తర్వాత సహకార సంఘానికి ఆ యంత్రాలు సొంతం అవుతాయని అన్నారు. కస్టమ్ హైరింగ్ హబ్ లో కోటి విలువైన భారీ యంత్రాలు ఏర్పాటు చేస్తున్నామని, వీటిని అద్దెకు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేశామని అన్నారు. నరసన్నపేట నియోజకవర్గానికి సంబంధించి అల్లాడ సొసైటీకి హబ్ అందుబాటులో ఉందని అన్నారు. ఆత్మ నిర్భర భారత్ పథకంలో భాగంగా రైతులకు గోడౌన్లు, కోల్డ్ స్టోరేజ్ లు, భూసార పరీక్షలు చేసే ల్యాబ్ లు నిర్మించేందుకు అనుమతులు లభించాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. నాబార్డు ద్వారా వీటిని మంజూరు చేయడమే కాకుండా రుణ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నారని చెప్పారు. డిసిసిబి ద్వారా జిల్లాలోని పిఎసిఎస్ నుంచి ఈ ఖరీఫ్ సీజన్లో 120 కోట్ల రూపాయల రుణాలను రైతులకు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి అయితే ప్రజా ప్రతినిధులు సచివాలయం ద్వారా పాలనను సమన్వయం చేసుకుంటారని వివరించారు. కరోనా కట్టడి అయిన తర్వాత ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉండవచ్చని పేర్కొన్నారు. సారవకోట మండలంలో కెళ్లవలస - జమ చక్రం డబుల్ లైన్ రోడ్డునకు రూ.15 కోట్లు మంజూరు చేసామని, వడ్డేన వలస-కొమనాపల్లి రోడ్డు కూడా 15 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తామని ఉప ముఖ్యమంత్రి క్రిష్ణ దాస్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ పాలవలస విక్రాంత్, సీఈఓ దత్తి సత్యనారాయణ, పిఎసిఎస్ ఛైర్మన్ గెల్లంకి వెంకటరమణ, మాజీ ఎంపీపీ చిన్నాల కూర్మి నాయుడు, వరదు రాఘవ, చిన్నాల వెంకట సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ నక్క తులసీదాస్, బాడన కృష్ణ, డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.



# చంద్రబాబు.. వాస్తవాలు తెలుసుకోవాలి

### మంత్రి అనిల్‌కుమార్ యాదవ్



నెల్లూరు: ప్రస్తుత కోవిడ్ పరిస్థితుల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. చంద్రబాబు చెప్పినట్టు ఇక్కడ జరగవని.. ఎన్నికల కమిషన్, ప్రభుత్వం కలిసి సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. ఏకపక్ష నిర్ణయాలు కుదరవన్నారు. శుక్రవారం ఆయన రామ్మూర్తినగర్, ఏఎస్‌నగర్‌లో 'నాడు-నేడు' పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడాలేని విధంగా స్కూళ్లను అభివృద్ధి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చంద్రబాబు ఇంట్లో కూర్చొని విమర్శలు చేయడం కాదని, వాస్తవాలు తెలుసుకోవాలని అనిల్ హితవు పలికారు. "జూమ్ మీటింగ్‌లో ఆరోపణలు చేయడం కాదు.. ఒకసారి స్కూళ్ల అభివృద్ధిని చూడండి. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ప్రజలకు ఏ విధంగా సేవలు అందిస్తుందో తెలుసుకోవాలి. టీడీపీ హయాంలో పెన్షన్ల కోసం వృద్ధులు చెప్పులు అరిగేలా తిరిగేవారు. సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన చేస్తున్నారని" మంత్రి అనిల్‌కుమార్ పేర్కొన్నారు

VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com